

జిల్లాలో యూరియా కొరత తీవ్రంగా ఉంది. పీఏసీఎస్‌లు, గ్రోమోర్ సెంటర్లకు బుధవారం రైతులు పోటెత్తారు. క్యూలైన్లలో గంటల తరబడి నిలబడ్డారు. తీరా అందుకునే సమయానికి ఎకరానికి అరకట్టకు మించి ఇవ్వబోమని ఆంక్షలు పెట్టడంతో రైతులు ఎదురుతిరిగారు. పీఏసీఎస్‌లకు వచ్చిన యూరియాను ఎక్కడికి తరలించారని, అరకట్ట ఇస్తే ఏం చేసుకోవాలని వాగ్వాదానికి దిగారు. కాంప్లెక్స్ ఎరువులు చల్లాలంటే తప్పనిసరిగా యూరియాను కలపాలని, యూరియా అందుబాటులో లేదంటే తాము ఏం చేయాలని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



పామర్రులో యూరియా కోసం భారీగా తరలివచ్చిన రైతులు

యూరియా వెతలు

జిల్లాలో పీఏసీఎస్‌లు, గ్రోమోర్ సెంటర్లకు పోటెత్తిన రైతులు



కోడూరులో కిక్కిరిసిన ఎరువుల కేంద్రం

- పట్టించుకోని వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులు
- వచ్చిన యూరియా ఎటు మళ్లించారో తెలియని స్థితి
- ఎకరానికి అరకట్ట మాత్రమే ఇస్తామని నిబంధన
- **చినముత్తేవిలో ఎరువుల లారీని అడ్డుకున్న వైసీపీ నాయకులు**

అరకొరగా ఎరువుల పంపిణీపై ఆగ్రహం

జిల్లాకు ఇప్పటి వరకు 27,200 టన్నుల యూరియా వచ్చినా సరిపోని వైనం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం/పామర్రు/కంకిపాడు: అన్నదాతకు ఈ ఏడాది వ్యవసాయ ప్రారంభ దశ నుంచే కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులను జిల్లా యంత్రాంగం సక్రమంగా అందించకపోవడంతో రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సొసైటీలు, ఎరువుల దుకాణాల దగ్గర పడిగాపులు పడుతున్నారు. జిల్లాకు ఆగస్టు నెల వరకు 27,200 టన్నుల యూరియా వచ్చినట్లుగా జిల్లా వ్యవసాయశాఖ అధికారుల లెక్కలు చెబుతున్నారు. గతంలో ఉన్న నిల్వలతో కలుపుకుని 28,743 టన్నుల యూరియా అందుబాటులో ఉంచామని అధికారులు అంటున్నారు. రైతులకు విక్రయించగా, ఇంకా జిల్లాలో 1,443 టన్నుల మిగతా 6లో..



పామర్రులో మహిళా రైతుల క్యూ

యూరియా బస్తా రూ.400 పైనే..

45 కిలోల యూరియా బస్తాను రూ.266.60 విక్రయించాల్సిండగా, బహిరంగ మార్కెట్‌లో రూ.400 విక్రయిస్తున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా జిల్లాలోని పీఏసీఎస్‌లకు యూరియాను పంపామని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు. అయితే యూరియాను కొందరు పెద్ద రైతులు తరలించుకుపోతుండటంతో సన్న, చిన్నకారు రైతులకు దొరకని పరిస్థితి నెలకొంది, వ్యవసాయశాఖ అధికారులు పీఏసీఎస్‌లు, వ్యాపారులకు యూరియాను ఇచ్చామని చెబుతున్నా రైతులకు యూరియా అందుబాటులో ఉండటంలేదు.

డిమాండ్‌కు అనుగుణంగా

ఎరువుల పంపిణీ

వెల్లడించిన సీఎం చంద్రబాబు



విజయవాడసిటీ , సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా జిల్లాలో డిమాండ్‌కు తగినట్టుగా ఎరువుల సరఫరా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. బుధవారం రాత్రి సీఎం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నిల్వ ఉన్న ఎరువుల వివరాలను ప్రకటించారు. ముఖ్యమంత్రి పేర్కొన్న వివరాల ప్రకారం....

కృష్ణాజిల్లాలో..: కృష్ణాజిల్లా వ్యాప్తంగా 1,67,667హెక్టార్లలో ఈ ఏడాది 1,49,817 హెక్టార్‌లలో ఖరీఫ్ సాగు జరుగుతోంది. దీని కోసం 35,529 మెట్రిక్ టన్నుల యూరియా కావాలని అధికారులు నివేదిక ఇవ్వగా 30,546 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. దీనిలో ఇప్పటి వరకు 27,677 మెట్రిక్ టన్నులను రైతులకు 194 పీఏసీఎస్‌లు, 340 మంది ప్రవేటు డీలర్‌లు, 300 రైతు శిక్షణ కేంద్రాల ద్వారా సరఫరా చేశారు. ప్రస్తుతం 2,870 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉంది. ఈ నెల 10వ తేదీ లోపు జిల్లాకు మరో 2,150 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

ఎన్టీఆర్ జిల్లాలో... : ఎన్టీఆర్ జిల్లాలో 94,931 హెక్టార్ల భూమి ఉండగా, అందులో 86,643 హెక్టార్లలో ఈ ఏడాది ఖరీఫ్ సాగు జరుగుతోంది. 24,305 మెట్రిక్ టన్నుల యూరియా కావాల్సి ఉందని అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. కిందటి ఏడాది కంటే ఈ ఏడాది సాగు విస్తీర్ణం అనూహ్యంగా పెరిగి ఎరువుల ఆవశ్యకతను పెంచిందన్నారు. దీంతో 29,032 టన్నుల యూరియా కావాలని అధికారులు రెండో దఫా నివేదిక ఇచ్చారు. అందులో ఇప్పటి మిగతా 6లో..



బి.వి.ఎల్.ఎస్.పద్మావతి, వై.యశోదలక్ష్మి, టి.చంద్రశేఖర్, కె.ఉదయకుమార్

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా

నలుగురు ఎంపిక

ఉమ్మడి కృష్ణాజిల్లాకు అరుదైన గౌరవం


- 5న విజయవాడలో అవార్డుల ప్రదానం
- సంతోషం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

మచిలీపట్నం టౌన్/గన్నవరం/గుడివాడ/పెదపారుపూడి/మోపిదేవి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన నలుగురు టీచర్లు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైనట్లు డీఈవో పి.వి.జె.రామారావు బుధవారం తెలిపారు. నాగాయలంక మండలం నాగాయలంక జిల్లాపరిషత్ హైస్కూల్ బయోలాజికల్ స్కూల్ అసిస్టెంట్ కె.ఉదయకుమార్, మోపిదేవి మండలం కోసూరివారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్ టి.చంద్రశేఖరరావు, పెదపారుపూడి మండలం దొండపాడు జిల్లాపరిషత్ ప్రధానోపాధ్యాయురాలు బి.వి.ఎస్.ఎల్.పద్మావతి, గన్నవరం మండలం వీరపనేనిగూడెం ఏపి సోషల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ వై యశోదలక్ష్మి ఈ నెల 5వ తేదీన విజయవాడ ఏ కన్వెన్షన్ హాల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అవార్డులు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. వీరు నలుగురు గురువారం విద్యాశాఖ డైరెక్టర్‌కు రిపోర్టు చేయాలని తెలిపారు. అవార్డుకు ఎంపికైన యశోదలక్ష్మి మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎనిమిది సార్లు జిల్లా స్థాయి అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి అవార్డు అందుకోనుండటం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని బి.వి.ఎస్.ఎల్ పద్మావతి తెలిపారు. రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపిక కావడంపై ఆనందం వ్యక్తం చేశారు. 29 సంవత్సరాల నుంచి ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్న తుంగల చంద్రశేఖర్ 2001లో జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, జిల్లా కలెక్టర్ నుంచి అక్షర కృష్ణ అవార్డులు తీసుకున్నారు. 2016 నుంచి 2018 రెండు సంవత్సరాలపాటు మండల, జిల్లా స్థాయిలో బెస్ట్ పురస్కారాలకు ఎంపికయ్యారు. పాఠశాలలో ఉత్తమ విద్యాబోధన, బోధనా సామాగ్రి ద్వారా విద్యార్థులకు బోధిస్తూ పలు రకాల సాంస్కృతిక అంశాల్లో విద్యార్థులను తీర్చిదిద్దటం ఈయన ప్రత్యేకత. సంపూర్ణ అక్షరాస్యత సాధించే దిశగా ఆయన చేసిన సేవలకు అనేక ప్రశంసాపత్రాలు పొందారు. విద్యార్థులకు వైజ్ఞానిక అంశాలను బోధించటం, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ సైన్స్ ఫెయిర్ పోటీలకు వెళ్లే స్థాయిలో విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చినందుకు కొమ్మినేని ఉదయకుమార్‌కు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. దానితోపాటు నేషనల్ క్యాడెట్ కోర్సు (ఎన్‌సీసీ)లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చినందుకు తగిన గుర్తింపు లభించింది.

23 మంది బెస్ట్ టీచర్లు

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల జాబితా విడుదల

వివరాలు వెల్లడించిన డీఈవో రామారావు



మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని 23 మంది ఉపాధ్యాయులకు ఈ నెల 5వ తేదీన జిల్లా పరిషత్ సమావేశపు హాలులో బెస్ట్ టీచర్ అవార్డులు అందించనున్నట్లు డీఈవో పి.వి.జె.రామారావు తెలిపారు. వివిధ మండలాలకు చెందిన స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు, ప్రధానోపాధ్యాయులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ అవార్డు ప్రదానోత్సవంలో గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ పాల్గొంటారని తెలిపారు.

అవార్డు గ్రహీతలు వీరే...

బందరు మండలం పోతేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ సెకండరీ గ్రేడ్ టీచర్ మల్లవోలు దుర్గాశ్రీలక్ష్మి, గన్నవరం మండలం వెదురుపావులూరు ప్రాథమిక పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్ దొప్పాల జెస్సీస్, కోడూరు మండలం స్వతంత్రపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్ కారాని నాగార్జున, తోట్లవల్లూరు మండలం కలాశ దళితవాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్ ఎస్. చినచింతయ్య, గన్నవరం మండలం దావాజీగూడెం మోడల్ ప్రైమరీ పాఠశాల ఎస్‌జీటీ రేమల్లి రత్నకుమారి, బాపులపాడు మండలం రంగన్నగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్ బండ్లపల్లి నాగరాజు, అంగలూరు ప్రభుత్వ బాలికల పాఠశాల పీఈటీ గొడవర్తి నెర్సిరోజమ్మ, కంకిపాడు మండలం ఉప్పులూరు మండల పరిషత్ యూపీ పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్ చిరువోలులంక నాగమల్లేశ్వరి, గుడ్లవల్లేరు మండలం మండల ప్రాథమిక పాఠశాల ఎస్‌జీటీ ఏ.వి.వరలక్ష్మి, గుడ్లవల్లేరు మండలం చందర్ల ఎంపీయూపీ పాఠశాల ఎస్‌జీటీ కె.రత్నం, కోడూరు మండలం లింగారెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాల ఎస్‌జీటీ తక్కెళ్ల నాగమణి, గుడ్లవల్లేరు మండలం పెదపాలెం ఎంపీయూపీ పాఠశాల ఎస్‌జీటీ తలశిల సురేష్, గుడివాడ ఏకేటిపి బాలికల ఉన్నత పాఠశాల పీఎస్ స్కూల్ అసిస్టెంట్ మల్లవల్లి అమ్మన్నబాబు, గుడివాడ ఎస్‌పీఎస్ మునిసిపల్ హైస్కూల్ బయోలాజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ మండవ శ్రీలక్ష్మి, గన్నవరం మండలం వీరపనేనిగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాదగాని సరళ, కోడూరు మండలం స్వతంత్రపురం జిల్లా పరిషత్ హైస్కూల్ సోషల్ స్కూల్ అసిస్టెంట్ కె.మదన్‌మోహనరావు, నాగాయలంక జిల్లా పరిషత్ హైస్కూల్ ఇంగ్లీషు స్కూల్ అసిస్టెంట్ అరవ సుజాత, కంకిపాడు మండలం ఈడుపుగల్లు జిల్లా పరిషత్ హైస్కూల్ హిందీ స్కూల్ అసిస్టెంట్ కూచి ప్రమీలారాణి, గుడివాడ గాంధీ మునిసిపల్ హైస్కూల్ ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ లోయ అనంతలక్ష్మి, మచిలీపట్నం మండలం బుద్దాలపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్ పెద్ది దుర్గా భవాని, గన్నవరం మండలం మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కొమెర కుమారబాబు, పమిడిముక్కల మండలం అలినక్కిపాలెం మండల పరిషత్ యూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మిర్జా నవజీష్ హుస్సేన్, ఉంగుటూరు మండలం వేలుపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు తిమ్మరాజు సీతారామ్ జిల్లా ఉత్తమ అవార్డులకు ఎంపికయ్యారు.

చెప్పులస్టాండ్, లగేజీ కౌంటర్లకు వేలం

గతంలో కంటే దుర్గగుడికి రూ.38 లక్షల అధిక ఆదాయం

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై భక్తుల లగేజీ, పాదరక్షలను భద్రపరచుకునే కౌంటర్ల నిర్వహణకు శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం అధికారులు మంగళవారం వేలంపాట నిర్వహించారు. ఈవో శీనానాయక్ ఆదేశాల మేరకు ఏసీ రంగారావు, ఏఈవో ఎస్.రమేశ్‌బాబు ఆధ్వర్యంలో మహామండపం ఆరో అంతస్థులో ఈ వేలం నిర్వహించారు. మొదట పాదరక్షలు భద్రపరచు కౌంటర్ నిర్వహణకు జరిగిన వేలంపాటలో మొత్తం నలుగురు పాల్గొన్నారు. వీరిలో కాంట్రాక్టర్ పార్వతి రూ.72 లక్షలకు టెండర్ దక్కించుకున్నారు. దీనివల్ల గతంలో కంటే దేవస్థానానికి రూ.20 లక్షల ఆదాయం సమకూరింది. లగేజీ కౌంటర్‌కు జరిగిన వేలంపాటలో నలుగురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. అర్జునవీధికి చెందిన కె.రవీంద్ర ఏడాదికి రూ.90 లక్షలు చెల్లించేందుకు ముందుకొచ్చారు. దీనివల్ల గతంలో కంటే దేవస్థానానికి రూ.18 లక్షల ఆదాయం సమకూరింది.

ఉపాధ్యాయులే
సమాజ నిర్మాతలు
- కేయూ ఉపకులపతి ఆచార్య కూన రాంజీ
- పది మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం
- మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణ

8

తహసీల్దార్ కార్యాలయానికి
బోటు వివాదం

6

పకడ్బందీగా దసరా ఏర్పాట్లు

మంత్రి నారా లోకేశ్‌తో వంగవీటి రాధా



ఏమిస్తారో..?

మంత్రి నారా లోకేశ్‌తో వంగవీటి రాధా భేటీ

- సుదీర్ఘ సమయం పాటు ఆంతరంగిక చర్చ
- కీలక బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ బుధవారం మంత్రి నారా లోకేశ్‌తో ఆంతరంగికంగా భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో రాధా రాజకీయ భవితవ్యంపై ఊహాగానాలు మొదలయ్యాయి. కీలక బాధ్యతలు కానీ, పదవులు కానీ అప్పగించనున్నారా...? అనే చర్చ ప్రారంభమైంది. గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి తరఫున వంగవీటి రాధా పోటీ చేయలేదు. కానీ, ప్రచారం నిర్వహించారు. రాధాకు ఇటీవల ఎమ్మెల్సీ పదవి ఇస్తారని అంతా అనుకున్నా.. పరిమిత స్థానాల కారణంగా, కొన్ని సమీకరణాల నేపథ్యంలో సాధ్యపడలేదు. ఆయన తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్నప్పటికీ రాజకీయాల్లో క్రియాశీలకంగా మాత్రం ఉండట్లేదు. ఇటీవల గుడివాడ వచ్చిన సందర్భంలో ఈ విషయాలు చర్చకు రాగా.. తన భవితవ్యాన్ని పార్టీ చూసుకుంటుందన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆయన లోకేశ్‌ను కలిశారు. రాధానే స్వయంగా వెళ్లారా? లోకేశ్ పిలిపించుకున్నారా? అనే అంశాలపై కూడా టీడీపీ వర్గాల్లో చర్చ మొదలైంది. లోకేష్‌తో భేటీ తర్వాత రాధా సమావేశ వివరాలను తెలియజేయలేదు. ఇది కేవలం మర్యాదపూర్వకంగా జరిగిన సమావేశం మాత్రమేనన్నారు. మంత్రి లోకేశ్ కూడా సమావేశం గురించి ఏమీ మాట్లాడలేదు.

పార్టీ పదవి కట్టబెట్టే అవకాశం ఉందా?

ఎన్టీఆర్, కృష్ణాజిల్లా రథసారథుల ఎంపికకు సంబంధించి ఇటీవల అధిష్ఠానం నియమించిన త్రీమెన్ కమిటీలు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకుల నుంచి అభిప్రాయ సేకరణ జరిపాయి. ఈ క్రమంలో రెండు జిల్లాలకు మూడేసి పేర్లను ప్రతిపాదించారు. అయితే, పార్టీ అధిష్ఠానం ఇప్పటి వరకు అధ్యక్షులను ప్రకటించలేదు. కాగా, ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో ఏదైనా ఒక జిల్లా బాధ్యతలు రాధాకు అప్పగిస్తారా..? అనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. ఇందుకు రాధా సుముఖంగా ఉంటారా, లేదా అన్నది కూడా ప్రశ్నగానే మారింది. పార్టీలో పదవుల విషయంలో ఆయన పెద్దగా ఆసక్తి చూపించరు. గతంలో ఆయన కాంగ్రెస్, వైసీపీలో పనిచేసినపుడు కూడా ఈ విషయం తేటతెల్లమైంది.



దుర్గగుడిలో దసరా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్

పకడ్బందీగా దసరా ఏర్పాట్లు

» ఇంద్రకీలాద్రిపై పనులను పరిశీలించిన ఈవో

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో దసరా నవరాత్రి మహోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసేందుకు ఈవో వీకే శీనానాయక్ బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈసారి దసరాకు పాత ఆర్.బి.ఫ్రేమ్‌లకు బదులుగా సింహాచలం దేవస్థానం నుంచి తెప్పించిన క్యూ ఫ్రేమ్‌లను వినియోగిస్తున్నారు. క్యూల వ్యవస్థను పటిష్టం చేయడం ద్వారా, పండుగ సమయంలో భక్తులకు మెరుగైన దర్శనం కల్పించడం దీని ముఖ్య ఉద్దేశమని చెబుతున్నారు. కొత్తగా నిర్మిస్తున్న ప్రసాదం పోటు భవనంలో డ్రెయినేజీ తదితర సౌకర్యాలను పరిశీలించి, అధికారులకు తగు సూచనలు చేశారు. కొండ పైభాగంలో ఏర్పాటు చేస్తున్న కొత్త పూజా మండపాల పనుల వివరాలను ఈఈ కోటేశ్వరరావు ఈవోకు వివరించారు. ఆలయంలోని ముఖ్య ప్రదేశాలలో జరుగుతున్న చిత్రలేఖన పనులను పరిశీలించారు. కొత్త అన్నదానం భవనం పనులను కూడా ఆయన పరిశీలించి, నాణ్యతతో కూడిన పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. దసరా నాటికి సిద్ధం కావాల్సిన ఎలివేటెడ్ క్యూల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. దసరా ఉత్సవాలు పకడ్బందీగా జరిగేందుకు తాను ప్రతిరోజూ ఆలయంలోని ప్రతి విభాగాన్ని, ప్రతిపని స్వయంగా పర్యవేక్షిస్తున్నామని ఈవో తెలిపారు.



బుల్లిరాజు కుటుంబసభ్యులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

కనకదుర్గమ్మ సేవలో బాల నటుడు

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంలో నటించిన బాలనటుడు పశ్చిమగోదావరి జిల్లా, భీమవరానికి చెందిన బీమాల రేవంత్ పవన్ సాయి సుభాష్ (బుల్లి రాజు) బుధవారం తల్లిదండ్రులు శ్రీనివాసరావు, దేవి, సోదరి ఆశ్రిత నైణితో కలిసి ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఈవో వీకే శీనానాయక్‌ను ఆయన చాంబర్‌లో కలిసి మెగాస్టార్ చిరంజీవితో నటించే తదుపరి చిత్రం, ఇతర అనుభవాలను పంచుకున్నారు. అమ్మవారి దర్శనానంతరం వేదపండితులు బుల్లిరాజు కుటుంబసభ్యులకు వేద ఆశీస్సులు అందజేశారు. అనంతరం ఈవో వారికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



రోగి శేషకుమారితో సూపరింటెండెంట్ ఏవీ రావు, వైద్యుల బృందం

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

విజయవాడ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మెదడులోని ద్రవం ముక్కు ద్వారా కారడం(సీఎస్ఎఫ్ రినోర్హియా) సమస్యతో బాధపడుతున్న మహిళకు జీజీహెచ్ వైద్యులు శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శేషకుమారి అనే మహిళకు 2015లో తొలిసారి విజయవాడ జీజీహెచ్‌లో, రెండోసారి 2021లో గుంటూరులో ఓపెన్ క్రానియోటమీ చేశారు. అయితే రెండు శస్త్రచికిత్సలు విఫలమయ్యాయి. మూడోసారి క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సిద్ధార్థ మెడికల్ కాలేజీ, ఈఎన్‌టీ విభాగం ఆధ్వర్యంలో ఆధునిక ఎండోస్కోపిక్ పద్ధతిలో విజయవంతంగా పూర్తిచేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డాక్టర్ కె.రవి మాట్లాడుతూ, కేసును ఎండోస్కోపిక్ పద్ధతిలో విజయవంతం చేయడం గర్వంగా ఉందన్నారు. ఈ వ్యాధి స్థూలకాయం ఉన్న, పెరిమెనోపాజ్ దశలో ఉన్న మహిళల్లో ఎక్కువగా కనిపిస్తుందని డాక్టర్ రవి పేర్కొన్నారు. శేషకుమారి ప్రస్తుతం కోలుకుంటున్నారని, మెడికల్ కాలేజీ ఈఎన్‌టీ, అనస్థీషియా విభాగాల సమన్వయంతో శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. వైద్య బృందాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.అశోక్‌కుమార్ అభినందించారు.



తహసీల్దార్ కార్యాయం వద్ద కోలుకొండ ప్రసాద్ వర్గీయులు

తహసీల్దార్ చెంతకు బోటు వివాదం

తోట్లవల్లూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు కృష్ణానది రేవులో చెలరేగిన నూతన బోటు వివాదం బుధవారం సాయంత్రం తహసీల్దార్ వద్దకు చేరింది. పాత బోటు యజమానులు, కొత్తబోటు యజమాని కోలకొండ ప్రసాద్ మధ్య కొద్ది రోజులుగా రైతులు, కూలీలను లంకలకు చేరవేసే విధానంపై వివాదం నడుస్తోంది. దీంతో బోటు యజమానును బుధవారం సాయంత్రం తహసీల్దార్ ఎం.కుసుమకుమారి పిలిపించి చర్చలు జరిపారు. కోలుకొండ ప్రసాద్ తన బోటులో ఇద్దరు, ముగ్గురు కూలీలు వచ్చినా ఆలస్యం చేయకుండా లంకకు చేరవేస్తున్నాడు. ఒకవ్యక్తికి లంక వెళ్లేందుకు రూ. 10, తిరిగి వచ్చేందుకు రూ. 10 చొప్పున చార్జీలను బోటు యజమానులు వసూలు చేస్తున్నారు. గతంలో పాత బోటు యజమానులు 20 నుంచి 30 మంది వరకు కూలీలను ఎక్కించి బోటును నడిపేవారు. కొత్త బోటులో సంఖ్యతో నిమిత్తం లేకుండా బోటు నడుపుతుండటంతో పాత యజమానులు అభ్యంతరం తెలపటం, వాగ్వాదాలు జరుగుతున్నాయి. దీంతో తహసీల్దార్ అందరినీ పిలిపించి కలిసి పనిచేసుకోవాలని, వివాదాలు వద్దని సూచించారు. 15 మంది చొప్పున బోటులో ఎక్కించి నడుపుకోవాలని, గురువారం నుంచి రేవు వద్ద పోలీసులను ఏర్పాటు చేస్తామన్నారు.

యూరియా.. ఇవ్వండయ్యా!



ఎ.కొండూరు సొసైటీ వద్ద క్యూలో ఉన్న రైతులు



» యూరియా కోసం రైతుల బారులు
» ఉదయం నుంచే సొసైటీల వద్ద పడిగాపులు
» అవసరానికి సరిపడా అందక అన్నదాతల అవస్థలు
» సమయానికి వేయకపోతే దిగుబడి రాదని ఆవేదన

కోడూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి సాగుకు యూరియా అవసరం అధికంగా ఉంది. అయితే అవసరాల మేరకు అందుబాటులో లేకపోవటంతో రైతులు యూరియా



కోడూరు గ్రోమోర్ సెంటర్ వద్ద బారులుతీరిన రైతులు

కోసం పీఏసీఎస్‌ల వద్ద పడిగాపులు పడుతున్నారు. కోడూరు మండలంలో సుమారు 17వేల ఎకరాల్లో 80 శాతం నాట్లు పూర్తయ్యాయి. పంటకు సకాలంలో యూరియా వేయకపోతే దిగుబడి రాదని రైతులు చెబుతున్నారు. అవసరాల మేరకు ఇప్పటికైనా యంత్రాంగం క్షేత్రస్థాయిలో యూరియా సరఫరాచేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. మండలంలోని ఆరు పీఏసీఎస్‌లకు 80 టన్నులు, గ్రోమోర్ సెంటర్‌కు 20 టన్నుల యూరియా వచ్చిందని, కట్ట యూరియా రూ.266.50



రావివారిపాలెం వద్ద బారులు తీరిన రైతులు

విక్రయిస్తున్నట్టు వ్యవసాయ శాఖ అధికారి ఎం.శ్రీధర్ తెలిపారు.

ఘంటసాల : లంకపల్లి సొసైటీకి యూరియా వచ్చిందని సమాచారంతో లంకపల్లి, దాలిపర్రు, యండకుదురు, మల్లాయిచిట్టూరు, పూషడం గ్రామాలకు చెందిన ఆయకట్టు రైతులు ఒక్కసారిగా సొసైటీకి వందలాది మంది రావటంతో ఆ ప్రాంతమంతా రైతులతో కిక్కిరిసిపోయింది. తహసీల్దార్ విజయప్రసాద్ పర్యవేక్షణలో యూరియా పంపిణీ చేశారు.

మోపిదేవి: మండలంలోని రావివారిపాలెం, కె.కొత్తపాలెం పీఏసీఎస్‌లకు 20 టన్నులు, నాగాయితిప్ప, కోసూరువారిపాలెం, మెరకనపల్లి, పెదకళ్లేపల్లి, పెదప్రోలు, వెంకటాపురంలోని స్పందాక రైతు కేంద్రానికి 10 టన్నుల చొప్పున యూరియా సరఫరా జరిగింది. కొన్ని సొసైటీల్లో రైతులకు రెండు, కొన్నిచోట్ల ఒక కట్ట చొప్పున ఇస్తుండటంతో రైతులు అసహనం వ్యక్తం చేశారు. ఒకకట్ట, రెండు కట్టలు పంటకు సరిపోవని.. పూర్తిస్థాయిలో సరఫరా చేయాలని అధికారులను కోరుతున్నారు. పాలకవర్గసభ్యులు, అధికారులు కుమ్మక్కై నచ్చిన వారిని పదుల సంఖ్యలో ఇస్తూ అవసరమైన రైతులకు కేవలం కట్ట మాత్రమే ఇవ్వటం ఏంటని నిలదీశారు. రైతుల ఆరోపణలపై మండల స్థాయి అధికారులు పీఏసీఎస్‌లను సందర్శించి యూరియా పంపిణీని పరిశీలించారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.సాయిబాబు, తహసీల్దార్ ఎం.హరనాథ్, ఏడీఏ జయప్రద,



చిల్లకల్లులో యూరియా కోసం..

ఏవో హెబ్సిబా రాణి, ఎస్ఐ వైవి.సత్యనారాయణలు కె.కొత్తపాలెం, రావివారిపాలెం, నాగాయితిప్ప సొసైటీలను సందర్శించి యూరియా పంపిణీ తీరును పరిశీలించారు.

జగ్గయ్యపేట రూరల్ : చిల్లకల్లులో బుధవారం యూరియా కోసం గ్రామాల నుంచి పెద్ద ఎత్తున రైతులు రావటంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. మార్క్‌ఫెడ్ నుంచి 335 బస్తాలు చిల్లకల్లు గోడౌన్‌కు చేరాయి. ఉదయం నుంచే కూపన్‌ల ప్రకారం యూరియాను పంపిణీ చేశారు. రైతుకు రెండు బస్తాలు పంపిణీ చేశారు.

ఎ.కొండూరు : మండలంలో బుధవారం యూరియాను రెవెన్యూ, పోలీసు అధికారులు స్వయంగా పర్యవేక్షిస్తూ రైతులకు పంపిణీ చేశారు. కంభంపాడు గ్రోమోర్ ద్వారా 15 టన్నులు, ఎ.కొండూరు సొసైటీ ద్వారా 15 టన్నులు, కోడూరు సొసైటీ ద్వారా 10 టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేశారు. కొందరు రైతులకు యూరియా అందలేదు. రైతులందరికి యూరియా సరఫరా చేయాలని సీపీఎం నేత జె.వెంకటేశ్వరావు ప్రభుత్వాన్ని కోరారు. కంభపాడు గ్రోమోర్ వద్ద ఉదయం 6 గంటల నుంచి క్యూలో ఉన్నా పలువురికి యూరియా అందలేదన్నారు.

ఉయ్యూరు : ఉయ్యూరులో యూరియా కోసం రైతులు మన గ్రోమోర్ షాపు వద్ద బుధవారం బారులుతీరారు. మండల పరిధి గ్రామాల రైతులు ఉదయాన్నే పెద్దయెత్తున తరలివచ్చి క్యూలో నిలుచున్నారు. మండల వ్యవసాయ అధికారి నిస్సీగ్రేస్, రెవెన్యూ సిబ్బంది సమక్షంలో రైతులకు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం ఉన్న వారికి ఎకరాకు అరకట్ట చొప్పున యూరియా పంపిణీ చేశారు. మనగ్రోమోర్‌కు 35 టన్నుల యూరియా వచ్చిందని, ఎకరానికి అరకట్ట చొప్పున 20 ఎకరాలు అంతకంటే ఎక్కువ పొలం సాగు చేస్తున్నవారికి 8 కట్టలు మించకుండా పంపిణీచేస్తున్నామని వ్యవసాయ అధికారి తెలిపారు.



ఉయ్యూరు మనగ్రోమోర్ షాపు వద్ద ..

పది రోజులుగా యూరియా లేదు..



- జొన్నలగడ్డ రామారావు, రైతు

కోడూరులో 10 రోజులుగా యూరియా లేదు. అధికారులు మాత్రం కొరత లేదని ప్రకటనలు చేస్తున్నారు. పంటకు సకాలంలో యూరియా వేయకపోతే తీవ్రంగా నష్టపోతాం, ఖరీఫ్ సీజన్‌కు తగినంత యూరియాను అందించి ఆదుకోవాలి.



- రేపల్లె యోగ ప్రకాష్, రైతు

యూరియా సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మార్కెట్‌లో యూరియా లేకపోవడం కారణంగా సన్న, చిన్నకారు రైతులు సకాలంలో ఎరువులు వేయలేకపోతున్నారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో యూరియా సరఫరా చేయాలి.

రైతులందరికి యూరియా అందజేస్తాం

» జేడీఏ పద్మావతి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జేడీఏ పద్మావతి, ఇతర అధికారులు

కూచిపూడి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రైతులందరికీ యూరియా అందేలా చర్యలు చేపడుతున్నట్టు వ్యవసాయ శాఖ జేడీ పద్మావతి తెలిపారు. బుధవారం కూచిపూడిలో పలువురు అధికారులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, మంగళవారం అర్ధరాత్రి యూరియా లోడుతో వెళ్తున్న లారీని మొవ్వ మండలం చినముత్తేవి గ్రామంలో పలువురు రైతులు అడ్డుకుని యూరియా మాకే కావాలంటూ ఆందోళన చేపట్టిన నేపథ్యంలో యూరియా లారీని కూచిపూడి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. యూరియా అన్ని అనుమతులతో ఇన్వాయిస్ ప్రకారం జోకిపర్రు, చినముత్తేవి, నిడుమోలు గ్రామాల్లోని ఎరువుల దుకాణాలకు దిగుమతి నిమిత్తం వెళ్తున్నట్టు తెలిపారు. రైతులకు అందించేందుకు దుకాణాలకు వెళ్తున్న యూరియాను అడ్డుకోవటం తగదన్నారు. అధికారులు, రైతుల సమక్షంలో పంచనామా నిర్వహించగా, ఇన్వాయిస్ ప్రకారం యూరియా ఉన్నట్టు తేలిందన్నారు. రైతులు అడ్డుకున్న లారీని తిరిగి నిడుమోలులోని గంగా ఫెర్టిలైజర్ దుకాణానికి తరలిస్తున్నట్టు తెలిపారు. యూరియాను రైతుకు ఎకరాకు అరకట్ట చొప్పున పంపిణీ చేపట్టనున్నట్టు తెలిపారు. రైతులు ఎవరు ఎలాంటి అపోహలు చెందవద్దని, అధిక ధరలకు విక్రయించినా యూరియాతోపాటు గుళికలు, ఇతర ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామంటూ దుకాణదారులను ఇబ్బందులకు గురి చేసిన రైతులు వ్యవసాయ శాఖాధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మొవ్వ సబ్ డివిజన్ ఏడీఏ శ్యామల, ఏవో సురేష్‌బాబు నాయక్, తహసీల్దార్ మస్తాన్, ఎస్ఐ కె.ఎన్.విశ్వనాథ్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ మురళీ కిషోర్ పాల్గొన్నారు.



నందిగామలో గ్రోమోర్ షాపును తనిఖీ చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

నందిగామ : యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని సందర్శించిన కలెక్టర్ స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. అక్కడ ఉన్న రైతులతో మాట్లాడిన కలెక్టర్ యూరియా కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. వారం రోజుల్లో పూర్తిగా అందుబాటులోకి రానున్నట్టు చెప్పారు. ఎక్కడైనా యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. కలెక్టరేట్ టోల్‌ఫ్రీ నెంబర్‌తో కూడిన బోర్డును దుకాణం ఎదుట ప్రదర్శించాలని నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.బాలకృష్ణ, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

డిమాండ్‌కు అనుగుణంగా ఎరువుల పంపిణీ

(5వ పేజీ తరువాయి)

వరకు 25,558 మెట్రిక్ టన్నుల యూరియాను 103 పీఏసీఎస్‌లు, 227 రైతు శిక్షణా కేంద్రాలు, 229 మంది ప్రవేటు డీలర్ల ద్వారా విక్రయించారు. ప్రస్తుతం జిల్లాలో 3,474 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉంది. దీంతో పాటు 1,311 మెట్రిక్ టన్నుల డీఏపీ, 1,246 మెట్రిక్ టన్నుల ఎంవోపీ, 12,948 మెట్రిక్ టన్నుల ఎన్‌పీకే, 2,195 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పీ, 83 మెట్రిక్ టన్నుల కంపోస్ట్, 30 మెట్రిక్ టన్నుల ఎఫ్‌వోఎం నిల్వలు ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ నెల ఆరోవ తేదీ నుంచి 10వ తేదీ మధ్యలో జిల్లాకు 3,650 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

ముగ్గురు అక్రమార్కులపై కేసులు నమోదు

ఎరువులను అక్రమంగా నిల్వ ఉంచి అధిక ధరలకు విక్రయిస్తున్న ముగ్గురిపై ఎన్టీఆర్ జిల్లా పోలీస్ యంత్రాంగం కేసులు నమోదు చేసింది. పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎరువుల దుకాణాలను పోలీసులు తనిఖీ చేశారు. తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరులో కృత్రిమ కొరత సృష్టిస్తున్న వారిని గుర్తించారు. ఆయా దుకాణాల్లో నిల్వ ఉన్న ఎరువులు, రికార్డుల్లో నమోదు చేసిన లెక్కలు తేడా ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. అక్రమంగా ఎరువులు నిల్వ ఉంచిన వారిపై ఆయా పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదు చేశారు. ఎరువుల దుకాణాలపై పోలీసుల తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, కృత్రిమ కొరత సృష్టించినా, రికార్డులు సక్రమంగా లేకపోయినా, అధిక ధరలకు విక్రయించినా కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా పోలీస్ యంత్రాంగం హెచ్చరిక చేసింది.

యూరియా వెతలు

(5వ పేజీ తరువాయి)

యూరియా నిల్వలు ఉన్నాయని చెబుతున్నా.. రైతులకు యూరి యా అందుబాటులోకి రావడం లేదు. రైతులకు పీఏసీఎస్‌లు, ఎరువుల దుకాణాల ద్వారా యూరియాను విక్రయించడం లేదు. రెండు రోజుల క్రితం జిల్లాలోని ఎరువుల దుకాణాలకు 50 కట్టల చొప్పున ఇచ్చారు. ఈ ఎరువు 10 నిముషాల వ్యవధిలోని విక్రయించేశారు. జిల్లా వ్యాప్తంగా యూరియా కోసం రైతులు బారులు తీరడంతో పలు మండలాల్లో గందరగోళం ఏర్పడింది. ఈ సమస్యపై కలెక్టర్ బాలాజీ బుధవారం స్పందించారు. జిల్లాకు ఈ నెల 1న గ్రోమోర్ కంపెనీ నుంచి 243 టన్నులు, 2న కోరమాండల్ కంపెనీ నుంచి 1,200 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని తెలిపారు. రానున్న 10 రోజుల్లో జిల్లాకు నాలుగు వేల టన్నుల యూరియా వస్తుందని కలెక్టర్ భరోసా ఇచ్చారు.

విక్రయాల్లో గందరగోళం

కోరమాండల్ కంపెనీ వారు రిటైల్ అవుట్‌లెట్స్‌లోనే యూరియాను ఉంచారని రైతులు ఆరోపిస్తున్నారు. గ్రోమోర్ కంపెనీ నుంచి వచ్చిన యూరియాను సొసైటీలకు ఇచ్చినా అవి ఏ మూలలకు సరిపోలేదు. పలు మండలాల నుంచి యూరియా కావాలని వ్యవసాయ శాఖ ఇండెంట్ పెట్టలేదని రైతులు ఆరోపిస్తున్నారు. వ్యాపారులు తమ సొంత ఖాతాలకు కాకుండా, ఏ ప్రాంత రైతులు వచ్చినా యూరియా విక్రయించాలనే షరతులు వ్యవసాయశాఖ అధికారులు పెట్టారు. పీఏసీఎస్‌లకు మాత్రం సొసైటీ పరిధిలోని రైతులకు మాత్రమే యూరియాను విక్రయించాలనే షరతులు పెట్టారు. దీంతో యూరియా విక్రయాల్లో మరింత గందరగోళం నెలకొంది.

గ్రామాల్లో పడిగాపులు

-కంకిపాడు మార్కెట్ యార్డులోని వ్యవసాయశాఖ కార్యాలయం చుట్టూ వారం రోజులుగా యూరియా కోసం తిరుగుతున్నామని అయినా, ఇంతవరకు యూరియా ఇవ్వలేదని రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో అధికారులు రైతుల పేర్లు రాసుకుని గురువారం రైతులకు స్లిప్‌లు ఇస్తామని చెప్పారు. వారం రోజులుగా యూరియా కోసం ఎదురు చూస్తున్నామని, 10 ఎకరాలు సాగు చేసే రైతులకు కూడా రెండు బస్తాల యూరియా మాత్రమే ఇస్తామని అంటున్నారని, ఇది ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నించారు. పామర్రు పట్టణంలోని మన గ్రోమోర్ ఏజెన్సీకి యూరియా దిగుమతి అయిందన్న సమాచారం అందుకున్న మండల పరిధిలోని రైతులు వేకువజాము నుంచే సంబంధిత స్టాక్ పాయింట్ కు చేరుకుని పడిగాపులు పడ్డారు. అవనిగడ్డలోనూ రైతులది అదే పరిస్థితి.

ఎరువుల లారీని అడ్డుకున్న వైసీపీ నాయకులు

మొవ్వ మండలం చినముత్తేవి గ్రామం మీదుగా మంగళవారం రాత్రి నిడుమోలు గ్రామానికి ఎరువుల లారీ వెళుతోంది. డోకిపర్రు, చినముత్తేవి, నిడుమోలు గ్రామాలకు ఈ లారీలోని యూరియా, ఇతర ఎరువులు దించాల్సి ఉంది. అయితే ఈ లారీని చినముత్తేవిలో వైసీసీ నాయకులు అడ్డుకున్నారు. లారీడ్రైవర్ అన్ని ఆధారాలు చూపినా, వైసీపీ నాయకులు వినిపించుకోలేదు. దీంతో ఎస్ఐ సంఘటనా స్థలానికి వచ్చి లారీని పోలీస్ స్టేన్‌కు తరలించారు. బుధవారం వ్యవసాయశాఖ జేడీ పద్మావతి, ఏడీఏ శ్యామల, తహసీల్దార్ మస్తాన్, ఎస్ఐ కేఎన్ విశ్వనాథ్, ఏవో సురేష్‌బాబునాయక్ రైతుల సమక్షంలో పంచనామా నిర్వహించారు. లారీలో 150 బస్తాలు సక్రమంగా ఉన్నట్లు నిర్ధారించారు.

అర్ధరాత్రి రెచ్చిపోయారు!

» చొక్కాలు పట్టుకుని కానిస్టేబుళ్ల ఘర్షణ
» ఇద్దరినీ సస్పెండ్ చేసిన పోలీసు కమిషనర్



రోడ్డుపై చొక్కాలు పట్టుకుని ఘర్షణ పడుతున్న కానిస్టేబుళ్లు, కానిస్టేబుల్ చొక్కా పట్టుకుని లాక్కెళ్తున్న మహిళ

అజిత్‌సింగ్‌నగర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఒకరు ట్రాఫిక్ కానిస్టేబుల్.. మరొకరు అజిత్‌సింగ్‌నగర్ స్టేషన్ కానిస్టేబుల్.. స్వల్ప విషయమై ఇద్దరిమధ్య మాటా మాటా వచ్చింది. సహనం కోల్పోయిన ఖాకీలు అర్ధరాత్రి నడిరోడ్డుపై చొక్కాలు పట్టుకుని కొట్టుకున్నారు. విషయం కమిషనర్ దృష్టికి వెళ్లడంతో బుధవారం ఇద్దరినీ సస్పెండ్ చేశారు. వివరాల ప్రకారం.. 4వ పట్టణ ట్రాఫిక్ కానిస్టేబుల్ శ్రీనివాస్ నాయక్ డాబాకొట్లు సెంటర్‌లో నివాసం ఉంటున్నాడు. మంగళవారం అర్ధరాత్రి మూడుగంటల సమయంలో మధురానగర్ పసుపుతోటకు చెందిన ఓ మహిళతో శ్రీనివాస్ నాయక్ డాబాకొట్లు సెంటర్ వద్ద గొడవ పడుతున్నాడు. అటుగా బీట్ నిర్వహిస్తున్న అజిత్‌సింగ్‌నగర్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు వారిని ప్రశ్నించగా.. అజిత్‌సింగ్‌నగర్‌లోని బంధువుల ఇంటికి వచ్చానని.. దారిలో వాహనంలో పెట్రోల్ అయిపోయిందని మహిళ చెప్పుకొచ్చింది. తనకు శ్రీనివాస్ నాయక్ పరిచయస్తుడని చెప్పింది. దీంతో కోటేశ్వరరావు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కొద్దిసేపటికి శ్రీనివాస్‌నాయక్, మహిళ రైతుబజార్ వద్ద ఘర్షణ పడుతుండగా చూసిన కానిస్టేబుల్ కోటేశ్వరరావు వారిని స్టేషన్‌కు రావాలని చెప్పాడు. దీంతో ఆగ్రహించిన శ్రీనివాస్ నాయక్ ఘర్షణకు దిగాడు. మధ్యలో మహిళ కలుగజేసుకుని డ్యూటీలో ఉన్న కోటేశ్వరరావు చొక్కా పట్టుకుని రోడ్డుపైకి లాగింది. అనంతరం కోటేశ్వరరావు జరిగిన విషయాన్ని పైఅధికారులకు చెప్పడంతో కమిషనర్ రాజశేఖర్‌బాబు ఇద్దరిని సస్పెండ్ చేశారు. కాగా ఘర్షణలో మహిళ పాత్రపై పోలీసులు విచారిస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 570

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి

హనుమాన్‌జంక్షన్,సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బాపులపాడు వ్యవసాయ మార్కెట్ యార్డను మరింత అభివృద్ధి చేయడానికి గన్నవరం మార్కెట్ యార్డు చైర్మన్ గూడవల్లి నరసింహారావు ఆధ్వర్యంలో కమిటీ కృషి చేస్తోందని ఆ కమిటీ డైరక్టర్లు గార్లపాటి రాజేశ్వరరావు, మున్నంగి బాబూరావు తెలిపారు. కమిటీ డైరక్టర్లుగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో బుధవారం యార్డును సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

స్వామిత్వ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ డీకే బాలాజీ



స్వామిత్వ సర్వేపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

కంకిపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వే కార్యక్రమాన్ని ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ డి.కె. బాలాజీ అన్నారు. గుడివాడ, ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని రెవెన్యూ, పంచాయతీరాజ్, సర్వేయర్లు, సచివాలయ సిబ్బందికి బుధవారం శ్రీకృష్ణ కల్యాణ మండపంలో స్వామిత్వ సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ, భవిష్యత్తులో భూ తగాదాలను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్వామిత్వ సర్వే కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. సర్వే చాలా కీలకమైందన్నారు. ఇంటిని, భూమికి సంబంధించిన సరిహద్దులను ఈ సర్వే ద్వారా గుర్తించటం జరుగుతుందని తెలియజేశారు. భవిష్యత్తులో సరిహద్దులపై వివాదాలు జరగకుండా సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అధికారు లకు, సిబ్బందికి ఆయన సూచించారు. గతంలో భూ కొలతలను గొలుసులు, టేపుల ద్వారా నిర్వహించే వారని, ప్రస్తుతం రోవర్ల ద్వారా ఈ సర్వే చేపడుతున్నామని తెలియజేశారు. ఇంటి యజమానులకు 9(2) నోటీసులు ఇచ్చి వారి నుంచి అభ్యంతరాలు స్వీకరించి డ్యాకుమెంట్లు పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరముం టుందన్నారు. భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు రాకుండా ఆర్.ఎస్. డి.టిల స్పీకింగ్ ఆర్డర్లను కూడా నమోదు చేయాలన్నారు. సర్వే చేసిన రోజునే వెక్టరైజేషన్ కూడా పూర్తి చేస్తే రికార్డుల స్పష్టంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీపీవో జె. అరుణ, ఏడీ జోషిలా, డీఎల్‌పీవో సంపత్ కుమార్, డీఎల్‌డీవో రాజేష్, ఎంపీడీవో అనూష, సర్వేయర్లు, ఇంజనీరింగ్ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూ రీసర్వే రికార్డుల పరిశీలన

ఉయ్యూరు : బొళ్లపాడులో భూమి రీసర్వే చేసిన రికార్డులను కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలీశర్మ బుధవారం పరిశీలించారు. గ్రామ సచివాలయంలో రీసర్వేకు సంబంధించిన రికార్డులు పరిశీలించిన అనంతరం స్థానిక రైతులతో ఆయన మాట్లాడి సర్వేపై వారి అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో శ్మశనవాటికకు స్థలాన్ని కేటాయించాలని గ్రామస్తులు కోరగా రైతులు ముందుకు వస్తే భూసేకరణ చేసి ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అదే విధంగా కాటూరు నుంచి బొళ్లపాడుకు వచ్చే ఆర్అండ్‌బీ రోడ్డు పొడవునా గుంతలమయంగా తయారై గ్రామస్తులకు ఇబ్బంది కలుగుతుందని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా రోడ్డుకు నిధులు కేటాయించారని, త్వరలో పనులు ప్రారంభిస్తారని తెలిపారు. ఆర్డీవో బీఎస్ హేలా షారోన్, తహసీల్దార్ సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.



జలవనరులశాఖ ఎస్ఈ మోహనరావుకు వినతిపత్రం అందజేస్తున్న డీసీ చైర్మన్లు

ఏలూరు కాలువ ఆధునికీకరణ పనులు చేపట్టాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : వేలాది ఎకరాలకు సాగునీటితో పాటు గ్రామాలకు తాగునీరందించే ప్రధానమైన ఏలూరు కాలువ ఆధునికీకరణ పనులు చేపట్టాలని జలవనరులశాఖ ఎస్ఈ మోహనరావును డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్ కోరారు. విజయవాడ ఇరిగేషన్ కార్యాలయంలో బుధవారం జరిగిన డీసీ చైర్మన్ల సమావేశంలో ఎస్ఈకి వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. డీసీ-2 పరిధిలోని ఆత్కూరు సెక్షన్ కార్యాలయాన్ని నూతనంగా నిర్మించాలని, ఏలూరు కాలువ పూడిక పనులతో పాటు గట్లపై జంగిల్ క్లియరన్స్ చేపట్టటంతోపాటు గట్లు పటిష్ఠపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీ-1 చైర్మన్ కొసరాజు రాంబాబు, వైస్ చైర్మన్ నల్లిబోయిన గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పర్యవేక్షణలో గన్నవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో కంప్యూటర్ కోర్సుపై మూడు నెలలు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బాపులపాడు ఇన్‌చార్జి ఎంపీడీవో తిరుమల త్రినాధరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇతర వివరాలకు 949400 5725 ఫోన్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.



పడవలపై పనులకు వెళ్తున్న వ్యవసాయ కూలీలు

వ్యవసాయ పనులు ప్రారంభం

కంకిపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు, ఎగువనుంచి వస్తున్న వరదల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరదలు తగ్గుముఖం పట్టడంతో మద్దూరు పరిధిలోని పుచ్చలలంకలో వ్యవసాయ పనులకు కూలీలు క్యూ కట్టారు. వీరికి బాసటగా పడవలు నిలుస్తున్నాయి. భారీ మోటార్ సాయంతో నడిచే ఒక్కో పడవలో సుమారు 10 మంది సురక్షితంగా ప్రయాణించే అవకాశం ఉందని పడవల నిర్వాహకులు చెబుతున్నారు. ఉదయం పనులకు తీసుకెళ్లి సాయంత్రం సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరవేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.



వైద్యపరికరాలు, ఫర్నిచర్ వితరణ

ఉయ్యూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆనందపురంలో 104 సిబ్బంది ప్రజలకు వైద్యసేవలందించేందుకు అవసరమైన రూ.10వేలు విలువచేసే వైద్యప రికరం, ఫర్నిచర్‌ను బుధవారం అందజేశారు. ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్ ఆధ్వర్యంలో దాత గొల్లనపల్లి రవి సహకారంతో ఎమ్మెల్యే బోడెప్రసాద్ కుమారుడు బోడె వెంకట్రామ్ బుధవారం అందజేశారు. 104 సిబ్బందికి బీపీ మిషన్, ఇనుప అలమర, కుర్చీలు వితరణగా అందజేసిన రవిని వెంకట్రామ్, ప్రవీణ్, చినఓగిరాల పీహెచ్‌సీ డాక్టర్లు తేజశ్రీ, ఇంద్రావతి అభినందించారు.

ఇన్నర్‌వీల్ క్లబ్‌కు అవార్డు



ఉయ్యూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు ఇన్నర్‌వీల్ క్లబ్‌కు 2024-2025 సంవత్సరానికి ఉత్తమ తార అవార్డు లభించినట్టు క్లబ్ అధ్యక్షురాలు నర్రా సుధారాణి తెలిపారు. సంవత్సర కాలంలో చేసిన సేవా కార్యక్ర మాలకు గుర్తింపుగా జిల్లా క్లబ్‌ల్లో ఉత్త మ క్లబ్ చైర్మన్‌గా విశాఖప ట్నంలో జరిగిన కార్యక్రమంలో 302 జిల్లా చైర్మన్ ఎ.లక్ష్మీశ్రీనివాస్ ద్వారా అవార్డు అందుకున్నట్టు తెలిపారు.

సకాలంలో ఎరువులు అందిస్తాం : ఏవో

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : ఎరువుల సరఫరా విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని, సకాలంలో ఎరువులు అందించే విధంగా కార్యాచరణ చేపట్టామని త్వరలోనే యూరియా కూడా అందుబాటులోకి వస్తుందని ఏవో రంగనాథ్‌బాబు అన్నారు. తిప్పగుంట, సిరివాడ పీఏసీఎస్ గోడౌన్‌లను బుధవారం ఆర్ఐ గోపితో కలిసి ఆయన తనిఖీ చేశారు. మాదాల శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైతులందరికీ ఎరువులు పంపిణీ చేయాలి

ఉంగుటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పీఏసీఎస్‌లలో ఆధార్‌కార్డును గుర్తింపుగా తీసుకుని రైతులు, కౌలురైతులకు ఎరువులు పంపిణీ చేయాలని కౌలురైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టీవీ లక్ష్మణస్వామి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆత్కూరు పీఏసీఎస్‌లో పొలం పాస్‌పుస్తకం, అడంగల్‌కాపీ లేదా కౌలుగుర్తింపుకార్డులున్న రైతులకు మాత్రమే యూరియా పంపిణీ చేసే విధానాన్ని ఆయన తప్పుబట్టారు.

● కౌలురైతులందరికీ గుర్తింపుకార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం సుముఖంగా వుందని ఏవో గద్దె రమేష్ అన్నారు. ఆత్కూరు పీఏసీఎస్‌లో యూరియా పంపిణీ ప్రక్రియను తహసీల్దార్ జాలాది విమలకుమారి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ సబ్బినేని తనూజ, టీడీపీ గ్రామఅధ్యక్షుడు రామ్‌కిరణ్‌తో కలిసి ఏవో పర్యవేక్షించారు.



మునిసిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెండింగ్ పనులు వేగవంతం చేయాలి

మునిసిపల్ అధికారులకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆదేశం

పెనమలూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మునిసిపాలిటీలో పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం పోరంకిలోని తన కార్యాలయంలో మునిసిపల్ అధికారులు, సిబ్బందితో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఎమ్మెల్యే సూచించారు. వర్షాలకు ఇటీవల పడిన గోతులను పూడ్చి సరిచేయాలని ఆదేశించారు. బందరు రోడ్డులోని సైడు డ్రెయిన్లలో సిల్టు తీయించి మురుగునీరు బయటికి పోయేట్లు చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ షేక్ నజీర్, ఈఈ భూషణం, టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, యార్లగడ్డ సుచిత్ర, తుమ్మల రాంకుమార్, దోనేపూడి రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధికి దాతలు సాయమందించాలి



నాగేశ్వరరావు, పట్టాభిరామయ్యలకు తోపుడు బండ్లు అందజేస్తున్న బోడె వెంకట్రామ్

పెనమలూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పేదల ఆర్థికాభివృద్ధికి దాతలు ఉదారంగా సాయమందించాలని యువనేత వెంకట్రామ్ కోరారు. తాడిగడప మునిసిపాలిటీ పరిధిలోని యనమలకుదురు, తాడిగడపలకు చెందిన నిరుపేదలు మళ్లా రమాదేవి, కొండవీటి దేవుడమ్మలకు బుధవారం తోపుడుబళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, యార్లగడ్డ సుచిత్ర, కోయ ఆనంద్‌ప్రసాద్, అనంతనేని ఆజాద్, సంగెపు రంగారావు, తుమ్మల రాంకుమార్, మల్లంపాటి విజయలక్ష్మి, దండమూడి సాయిసుధ, తమ్ము అశోక్, బొంగరాల అబ్రహాం పాల్గొన్నారు.

కంకిపాడు : ఉప్పలూరుకు చెందిన ఉప్పలూరి నాగేశ్వరరావు, తెన్నేరు గ్రామానికి చెందిన కటికల పట్టాభిరామయ్యలకు అవసరమైన తోపుడు బండ్లను బుధవారం యువనేత బోడె వెంకట్రామ్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అధికారంలో ఉన్నా లేకున్నా నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడేది తన తండ్రి బోడె ప్రసాద్ అన్నారు. ఆపదలో ఉన్న వారికి 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో తెన్నేరు డీసీ యార్లగడ్డ రాజా బాబు, పీఏసీఎస్ అధ్యక్షులు పడవల మధుసూదనరావు, టీడీపీ ఉప్పలూరు అధ్యక్షుడు చలసాని రాధాకృష్ణ మూర్తి, కొండవీటి శివయ్య, సలీం పాల్గొన్నారు.

న్యాయ విద్యార్థులకు చట్టాలపై అవగాహన పెరగాలి

సిద్ధార్థ అకాడమి ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చాన్సలర్ కె. వీరయ్య చౌదరి



ప్రసంగిస్తున్న కొసరాజు వీరయ్య చౌదరి

కానూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): న్యాయ విద్యార్థులకు చట్టాలు, న్యాయస్థాన తీర్పులపై అవగాహన పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిద్ధార్థ అకాడమి ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చాన్సలర్ కొసరాజు వీరయ్య చౌదరి అన్నారు. కానూరులోని సిద్ధార్థ న్యాయ కళాశాల సెమినార్ హాలులో బుధవారం జరిగిన విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో చాన్సలర్ వీరయ్యచౌదరి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. న్యాయ వాదులు ఏదైనా ఒక కేసు వాదించాల్సి వచ్చినప్పుడు ఆకేసు పూర్తి వాస్తవాలను అర్థం చేసుకున్నప్పుడే సరైన చట్టాలను ఈ కేసుకు అన్వయించగలుగుతామన్నారు. ప్రతి వ్యక్తి తాను ఎంచుకునే వృత్తిలో నిజమైన వృత్తి నైపుణ్యా లను కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థి జీవిత లక్ష్యాలను నెరవేర్చుకునేందుకు పుస్తక జ్ఞానంతో పాటు ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానం కూడా అవసరమని ఆయన చెప్పారు. ప్రస్తుతం మన దేశంలో అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నప్పటికీ వాటిని అందుకోగలిగిన మానవ వనరులను పెంపొందించుకోలేకపోతున్నామని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ తమకున్న అర్హతలు, నైపుణ్యాలను వీలైనంత ఎక్కువగా పెంపొందించుకోవాలని వీరయ్య చౌదరి విద్యార్థులను కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ దివాకర్‌బాబు మాట్లాడుతూ, ప్రతి వ్యక్తి కూడా నిజమైన పూర్తి జ్ఞానం పొందాలంటే వ్యక్తిగత పరిశీలన, స్వీయ జవాబుదారితనం కలిగి ఉండా లని సూచించారు. కార్యక్రమంలో సిద్ధార్థ వర్సిటీ వైస్‌చాన్సలర్ పి. వెంకటేశ్వరరావు, ప్రొ. వీసీ ఏవీ రత్నప్రసాద్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్టీయూ సభ్యత్వాలు అందజేస్తున్న విద్యాసాగర్

నూతన మూల్యాంకన విధానం

బోధనకు గొడ్డలిపెట్టు: ఎస్టీయూ

గన్నవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నూతన మూల్యాంకన విధానం బోధనకు గొడ్డలి పెట్టు లాంటిదని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి దేవరపల్లి విద్యాసాగర్ అన్నారు. మండలంలోని దావాజీగూడెం, అల్లాపురం చింతలపేట చెంచులకాలనీ, దుర్గాపురం, కేసరపల్లి, సుందరయ్యనగర్ తదితర గ్రామాల్లోని పాఠశాలలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎస్టీయూ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి మోత్రు ఆనంద్‌కుమార్, రావెళ్ల ఆనంద్‌కుమార్, కోశాధికారి చిమట కృష్ణారావు, దోవారి సురేష్, బొకినాల శ్రీధర్ పాల్గొన్నారు.

షోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పోషకాహారం తీసుకోవడం వల్ల అందరికీ సంపూర్ణ ఆర్యోగం కలుగుతుందని ఐసీడీ ఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి తెలిపారు. వీరవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషకాహార వారోత్సవాల్లో భాగంగా పోషకాలు కలిగిన ఆహార పదార్థాలు, పోషకాహారం వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ కమలకుమారి, హెచ్‌ఎం ఉషారాణి, సుహాసిని, నాగమణి, రమాదేవి పాల్గొన్నారు.



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ఝాన్సీరాణి

రోడ్డు అభివృద్ధికి సహకరించాలి

ఉయ్యూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆకునూరు - కడవకొల్లు రోడ్డు అభివృద్ధికి గ్రామస్తులు, రైతులు సహకరించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఆకునూరు సెంటర్ నుంచి కడవకొల్లు వరకు జిల్లాపరిషత్ రోడ్డు అభివృద్ధిపై గ్రామస్తులు, రైతులతో ఆకునూరు రచ్చబండ వద్ద బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాపరిషత్ రోడ్డు జపాన్ టెక్నాలజీతో అభివృద్ధి చేసేందుకు రూ. 5కోట్లు మంజూరైనాయని, రోడ్డు పక్కన ఆక్రమణలు తొలగించేందుకు అందరూ సహకరించాలన్నారు. సర్పంచ్ గోలి వసంతకుమార్, టీడీపీ నాయకుడు అనుమోలు ప్రభాకరరావు పాల్గొన్నారు.



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న మెడీవ్యాలీ హాస్పిటల్ వైద్యులు

విద్యార్థులకు నేత్ర, దంత పరీక్షలు

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విద్యతో పాటు వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని స్థానిక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమేష్ చక్రవర్తి పంచకర్ల అన్నారు. బుధవారం బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మెడీవ్యాలీ హాస్పిటల్ సౌజన్యంతో వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్యులు పి.సుధ, పి.వినీల, స్పందన, హర్ష, వీన, నేత్ర, దంత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ నేతలు మేడికొండ బుచ్చిబాపయ్య, అక్కినేని రాఘవేంద్రరావు, మాకినేని శ్రీనివాసరావు, మత్తి రాంబాబు, మూల్పూరి సురేంద్ర, అక్కినేని ఫణి తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక ఆదిత్య బధిర విద్యాలయానికి సీనియర్ లయన్స్ క్లబ్ నేత మేడికొండ బుచ్చిబాపయ్య తన భార్య జయప్రద వర్ధంతి సందర్భంగా క్వింటా బియ్యం, రూ.5వేలు నగదు అందజేశారు. బుధవారం ఆదిత్య బధిర విద్యాలయంను సందర్శించి విద్యార్థుల సమక్షంలో జయప్రద వర్ధంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆకుల వెంకటరమణ పాల్గొన్నారు.



పశు సంవర్థక శాఖా మంత్రి అచ్చెన్నాయుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జాయింట్ డైరెక్టర్లుగా పదోన్నతి పొందిన అధికారులు

మంత్రి అచ్చెన్నాయుడును కలిసిన జేడీలు

కృష్ణలంక, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్థక శాఖలో జాయింట్ డైరెక్టర్లుగా పదోన్నతి పొందిన అధికారులు ఆ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పోస్టింగ్స్ కోసం పోటీ లేకుండా అందరూ సమన్వయంతో వ్యవహరించి ఎవరికి కావలసిన చోట వారికి ఆమోదయోగ్యంగా ప్రజా అవసరాలకు, పరిపాలనా అవసరాలకు అనుగుణంగా వ్యవహరించి ఏకాభిప్రాయంతో పోస్టింగ్స్ తీసుకోవాలని కోరారు. పదవి అనేది బాధ్యతని అధికారం కాదని మంత్రి హితవు పలికారు.



నిమజ్జనానికి వెళ్లేముందు లడ్డూను వేలంపాట వేస్తున్న బాలురు

లడ్డూ వేలంపాటలో రాజకీయాలా..?

- పోటీపడ్డ వైసీపీ, టీడీపీ, జనసేన అభిమానులు

గుణదల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతరల సమయంలో రాజకీయాలు చేయడం చూశాం. వినాయక చవితి, నవమి పందిళ్ల ఏర్పాటులోనూ రాజకీయ నేతలు వారి వారి ప్రాభల్యం చూపించుకోవడం చూశాం. అభం శుభం ఎరుగని చిన్నారులు ఏర్పాటు చేసుకున్న చవితి పందిరి వద్ద అదీను వినాయక లడ్డూ ప్రసాదం వేలంపాట విషయంలో వైసీపీ, జనసేన, టీడీపీ అభిమానులమని చెప్పుకునే యువకులు పోటీపడటం ఆశ్చర్యానికి గురిచేసింది. విజయవాడ రూరల్ మండలంలోని ప్రసాదంపాడు గ్రామంలో మూడేళ్ల నుంచి 20ఏళ్లలోపు వయసున్న ఒకేప్రాంతానికి చెందిన 15మంది బాలురు చవితి పందిరి ఏర్పాటు చేశారు. చందాలతోపాటు వినాయక విగ్రహానికి, ఊరేగింపురోజు నిమజ్జనానికి తీసుకెళ్లేందుకు తీన్‌మార్ ఏర్పాటుకు ఎవరో ఒకరిని దాతను వెతుక్కునేవారు. అలాగే నిమజ్జనం రోజున లడ్డూను వేలంపాట వేస్తున్నారు. ఈ యేడాది 5 కేజీల లడ్డూను వేలంపాట వేయగా రూ.2116తో పాట ప్రారంభించగా, జగన్‌మోహన్ రెడ్డి పాట అంటూ రూ.5వేలు, చంద్రబాబు పాట అని రూ.10వేలు చెప్పడంతో మరో గుంపు పవన్ కల్యాణ్ పాట రూ.20,116 అంటూ పాడుకోవడంతో యువకులు ఆశ్చర్యపోయారు. లడ్డూ అంత ధర పలుకుతుందని ఊహించలేదని ఆనందం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే ఓ భక్తుడు వినాయకుడికి సమర్పించుకున్న చాక్లెట్ల దండను కూడా వేలం వేద్దామని రూ.వెయ్యితో ప్రారంభించగా దాన్ని కూడా ఆయా పార్టీ అభిమానులు పోటీపడి చివరకు లోకేశ్ పాట అంటూ రూ.8116కు సొంతం చేసుకున్నారు.

ప్రకృతి సేద్యంలో ఎన్టీఆర్ జిల్లా నెంబర్‌వన్

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



కలెక్టరేట్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో రైతులను ప్రకృతి వ్యవసాయం దిశగా ప్రోత్సహించాలని, శాస్త్రీయ ఆధారాలతో అపోహలు తొలగించి, ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల మహిళలను ప్రకృతి సాగు దిశగా చేయిపట్టి నడిపించాలని, ఇందుకు అవసరమైన సహకారం అందించాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఏపీ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ (ఏపీ సీఎన్ఎఫ్), నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ (ఎన్ఎంఎన్ఎఫ్)పై బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయం యూనిట్‌గా ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే ఘన, ద్రవ జీవామృతాల తయారీ, వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి మాట్లాడుతూ నేల ఆరోగ్యం, వాతావరణ స్థితిస్థాపతలకు అనుగుణంగా రైతులకు ఖర్చు తగ్గించి నికరాదాయం పెంచేలా ప్రకృతి సేద్య విధానాలతో ముందుకెళ్లాల్సి ఉందన్నారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వై శంకర్ నాయక్ మాట్లాడుతూ ఎన్ఎంఎన్ఎఫ్ అనేది కేంద్ర ప్రాయోజిత పథకమని, ఇది వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తోందన్నారు. జిల్లాస్థాయిలో ప్రస్తుతం 149 వీవోలు పనిచేస్తున్నాయని, వీటిలో 94 వీవోలను ఎన్ఎంఎన్ఎఫ్ కింద తీసుకోవడం జరిగిందన్నారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి ప్రకృతి వ్యవసాయం, వివిధ పంటల్లో పురుగులు/తెగుళ్ల యాజమాన్య దీపిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. జిల్లా ఉద్యాన అధికారి పీ బాలాజీ కుమార్, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, జిల్లా పశుసంవర్థక అధికారి డాక్టర్ హనుమంతరావు, ఏటీఎంఏ ఏడీ టీ మాధవీలత, కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం రవికిశోర్, ఆర్‌వైఎస్ఎస్ సీనియర్ టీమ్ లీడర్ సీహెచ్ చంద్రశేఖర్, ఆర్ అరుణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేషన్లకు డైరెక్టర్ నియామకం

మచిలీపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వివిధ కార్పొరేషన్లకు డైరెక్టర్‌లను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. నాటక అకాడమీ డైరెక్టర్‌గా అవనిగడ్డ నియోజకవర్గానికి చెందిన పైడిపాముల స్వప్న (టీడీపీ)ను నియమించారు. ఏపీస్టేట్ మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మచిలీపట్నం నియోజకవర్గానికి చెందిన హసీంబేగ్ (టీడీపీ), ఏపీస్టేట్ అగ్రికల్చర్ మిషన్ డైరెక్టర్‌గా పామర్రు నియోజకవర్గానికి చెందిన శనివారపు కృష్ణసుమన్ (జనసేన), హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రామలింగేశ్వరరావు(టీడీపీ), ఏపీస్టేట్ వేర్‌హౌసింగ్ పెడన నియోజకవర్గానికి చెందిన దాసరి సత్యనారాయణ (జనసేన) నియమించారు.

ఏపీ లైఫ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ డైరెక్టర్‌గా దొండపాటి

ఏపీ లైఫ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ డైరెక్టర్‌గా దొండపాటి విజయ్ కుమార్ మైలవరం కీర్తిరాయినగూడెంకు చెందిన నియమితులయ్యాడు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉన్నారు. పార్టీకి ఎనలేని సేవలందించినందుకు గుర్తించి ఈ పదవి ఇచ్చినందుకు ఆనందంగా ఉందన్నారు.

దేవాలయాలే.. టార్గెట్

వరుసగా రెండు రోజులు ఆలయాల్లోని హుండీల్లో నగదు చోరీ ● సీసీ కెమెరాల ద్వారా ఆచూకీ కనుగొన్న పోలీసులు



కృష్ణలంక మెట్లబజారులోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో, కృష్ణలంక పాత పోస్టాఫీసు రోడ్డులోని కుర్తాళం పీఠంలో పగిలిపోయిన ఉన్న హుండీలు

కృష్ణలంక, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లోని హుండీలనే టార్గెట్‌గా పెట్టుకొన్నాడు ఆ దొంగ. వరుసగా రెండు రోజులు వేర్వేరు ఆలయాల్లోని హుండీలను బ్రేక్ చేసి వేలాది రూపాయల నగదును చోరీ చేశాడు. చివరికి పాపం పండి మంగళవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడిన గుడిలో సీసీ కెమెరాలకు చిక్కాడు. కృష్ణలంక పోలీసులు దొంగ ఆచూకీని గుర్తించారు. త్వరలోనే పట్టుకొంటామని సీఐ నాగరాజు తెలిపారు. వారం క్రితం కృష్ణలంక 22వ డివిజన్‌లోని మార్వాడీ గుడిలో పూజారిగా పనిచేస్తున్న అప్పయ్య శర్మ ఆలయం సమీపంలో ఓ ఇంటిలో నివసిస్తున్నారు. పై అంతస్తులో ఉన్న ఆయన ఇంటికి అర్ధరాత్రి 2 గంటల సమయంలో దొంగ ప్రవేశించగా అలికిడి కావడంతో శర్మ లేచి గట్టిగా అరవగా పరారయ్యాడు. తర్వాత సోమవారం అర్ధరాత్రి 1.30 నుంచి 2 గంటల మధ్య కుర్తాళం పీఠంలో ప్రత్యాంగిరా దేవి ఆలయంలోకి దొంగ గోడ దూకి ప్రవేశించి ఆలయం ముందున్న హుండీని బ్రేక్ చేసి అందులో సుమారు రూ.10వేలు నగదు చోరీ చేశాడు. ఇదేదో బాగుందనుకొని వెంటనే మంగళవారం రాత్రి కుర్తాళం పీఠానికి కూతవేటు దూరంలో ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలోకి ఇలాగే ప్రవేశించి హుండీని బ్రేక్ చేసి దాదాపు రూ.1.50 లక్షల వరకు నగదు మూట కట్టుకొని పారిపోయాడు. గుడి ఆవరణలోని సీసీ కెమెరాలను కృష్ణలంక పోలీసులు పరిశీలించగా తలపై చోరీ సొమ్ము ఉన్న మూటను తీసుకెళ్తుండటాన్ని గుర్తించారు. అతడి చేతిపై శ్రీనివాస్ అనే పచ్చబొట్టు ఉండటంతో పోలీసులు గుర్తించారు. త్వరలోనే నిందితుడిని పట్టుకొంటామని సీఐ నాగరాజు తెలిపారు.



ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులిచ్చి సత్కరిస్తున్న కేయూ ఉపకులపతి ఆచార్య కూన రాంజీ, డీఈవో పీవీజే రామారావు

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

- కేయూ ఉపకులపతి ఆచార్య కూన రాంజీ, డీఈవో పీవీజే రామారావు
- స్వచ్ఛంద సేవా సంస్థలకు రూ.2 లక్షల విరాళం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కూన రాంజీ అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మచిలీపట్నం శాఖ ఆధ్వర్యంలో 10 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులిచ్చి ఘనంగా సత్కరించారు. సన్‌స్టార్ స్కూలులో బుధవారం జరిగిన ఉపాధ్యాయ అవార్డుల ప్రదానంలో కృష్ణా విశ్వవిద్యాయం ఉపకులపతి ఆచార్య కూన రాంజీ, డీఈవో పీవీజే రామారావు పాల్గొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వీసీ కూన రాంజీ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఈ ఏడాది సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించనుందన్నారు. డీఈవో పీవీజే రామారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు విశ్వవిద్యాలయం, రిటైరైన టీచర్లను సత్కరించడం అభినందనీయమన్నారు. ఆగస్టు 15, జనవరి 26 వంటి జాతీయ పర్వదినాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తూ ఉపాధ్యాయులను అభినందించేలా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. సభాధ్యక్షుడు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జి కిశోర్‌కుమార్ సభకు అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లా విద్యానిధి కన్వీనర్ పీ శ్రీరామ్ మాట్లాడుతూ, పేద విద్యార్థులను ఆదుకునేందుకు వేమూరి వాణి విద్యానిధికి రూ.5 వేలివ్వడం అభినందనీయమన్నారు. ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, డీవైఈవో చంద్రశేఖర్‌సింగ్, కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వైస్ ప్రెసిడెంట్ అయ్యప్పస్వామి, స్టార్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎంఎల్ ఆదిత్య మాట్లాడారు. పేద విద్యార్థులు, బాధితులకు ఈ నిధులు చెక్కుల రూపంలో అందజేశారు.

అవార్డు గ్రహీతలు వీరే...

కాగా, కృష్ణా వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్ కిరణ్‌కుమార్, మచిలీపట్నం రైలు పేట మునిసిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బి రామకృష్ణ, రుస్తుంబాద మునిసిపల్ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ వేమూరి వాణి, రైలుపేట మాథ్స్ స్కూల్ అసిస్టెంట్ శివలంక ఉషాకిరణ్, సాయి ఫ్లోరా హైస్కూల్ ఉపాధ్యాయురాలు అయినాల రజని, సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ పిఆర్ఎస్ఎం ఉమాకాంత్, స్టార్ జూనియర్ కళాశాల అకడమిక్ డైరెక్టర్ ఎస్‌వి కృష్ణారావు, విశ్రాంత మునిసిపల్ హైస్కూల్ తెలుగు పండితుడు పన్యారం సాంబశివరావు, జార్జ్ కార్నేషన్ విశ్రాంత ఉపాధ్యాయుడు రెంటచింతల వెంకట రమణ, ఆర్గానిక్ కెమెస్ట్రీ బోధకుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు వెచ్చ సత్యనారాయణమూర్తికి అవార్డులు ఇచ్చారు.

టెక్కీ ఉద్యోగాల పేరుతో టోకరా

విజయవాడ/చిట్టినగర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ హెచ్‌సీఎల్‌లో టెక్కీ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి ఓ వ్యక్తి రూ.1.50 లక్షలను లాగేశాడు. దీనిపై బాధితుడు కొత్తపేట పోలీసులకు బుధవారం రాత్రి ఫిర్యాదు చేశాడు. చిట్టినగర్ రామచంద్రరాజు వీధికి చెందిన వట్నాన యువరాజ్ గన్నవరంలోని హెచ్‌సీఎల్ కంపెనీలో సీనియర్ ఎనలిస్ట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. తనతోపాటు పనిచేసే చింత సాయితేజ అనే యువకుడి ద్వారా తరుణ్ అనే యువకుడు పరిచయమయ్యాడు. తాను చెన్నైలోని కన్సల్టెన్సీలో పనిచేస్తున్నట్టు చెప్పుకొచ్చాడు. అమెజాన్, హెచ్‌సీఎల్ వంటి ప్రముఖ సంస్థల్లో తాను 14 మందికి ఉద్యోగాలు ఇప్పించానని చెప్పాడు. హెచ్‌సీఎల్ ఉద్యోగవకాశాలున్నాయని ఒక్కో ఉద్యోగానికి రూ.2.50లక్షలు ఖర్చవుతుందని చెప్పాడు. యువరాజు ఈ విషయాన్ని చిన్నమ్మ కుమార్తె భవానీకి చెప్పడంతో ఆమె ముందుకొచ్చింది. ఆమెకు సంబంధించిన గుర్తింపు కార్డు, ధ్రువీకరణపత్రాలు పంపాలని తరుణ్ అడిగాడు. తర్వాత తరుణ్ ఫోన్ చేసి ఆమె తరఫున పరీక్ష రాశానని చెప్పాడు. దీనికి రూ.60వేలు పంపమని బ్యాంక్ ఖాతా నంబరు ఇచ్చాడు. ఒకసారి రూ.40వేలు, మరోసారి రూ.20వేలు పంపారు. ఇంటర్వ్యూ సమయానికి ముందు మరికొంత ఇవ్వాలని చెప్పాడు. మొత్తంగా రూ.1.50 లక్షలను తరుణ్‌కు పంపారు. భవానీకి హెచ్‌సీఎల్ కంపెనీ పంపినట్టుగా మెయిల్స్ పంపాడు. మిగిలిన డబ్బుల కోసం పదేపదే ఫోన్లు చేసి తొందర పెడుతుండడంతో అనుమానం వచ్చిన వారు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈ ప్రయాణం నరకప్రాయం

- భారీవర్షాలకు జిల్లాలో దెబ్బతిన్న 105 ఆర్ అండ్ బీ రోడ్లు
- తక్షణ మరమ్మతులకు రూ.19 కోట్లు
- పూర్తి నిర్మాణానికి రూ.193 కోట్లు అవసరమని అధికారుల అంచనా
- అంచనాలు రూపొందించి కలెక్టర్ లక్ష్మీశకు అందజేత

భారీ గుంతలతో రోడ్లు అతలాకుతలం



భారీ వర్షాలకు దెబ్బతిన్న మైలవరం మండలంలోని వెల్వడం అడ్డరోడ్డు, మైలవరం మండలం గణపవరం గ్రామంలోని విస్సన్నపేట-విజయవాడ ప్రధాన రహదారి

ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ: అల్పపీడనం, ఉపరితల ఆవర్తన ద్రోణి జిల్లాలోని రహదారులను ఛిద్రం చేశాయి. మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా అప్పటికే కొద్దిగా పాడైన రోడ్లను జూలై, ఆగస్టు నెలల్లో కురిసిన భారీ వర్షాలు మరింతగా దెబ్బతీశాయి. ప్రస్తుతం భారీగుంతలు, మొనతేలిన కంకర రాళ్లతో భయంకరంగా దర్శనమిస్తున్నాయి. కనీసం నడిచేందుకైనా వీలు లేకుండా తయారయ్యి ప్రయాణికులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ప్రధానంగా రాష్ట్ర రహదారులు, జిల్లా ప్రధాన రహదారుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. తాజాగా జిల్లాలో 105 రోడ్లు దెబ్బతిన్నాయని, భారీ గుంతలతో దర్శనమిస్తున్నాయని ఆర్ అండ్ బీ అధికారులు నివేదిక తయారు చేసి కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశకు మంగళవారం అందజేశారు.

493 కిలోమీటర్ల రోడ్లు ధ్వంసం

విజయవాడ, మైలవరం ఆర్‌అండ్‌బీ డివిజన్లలో 493.25 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయని అధికారులు నివేదికలో పేర్కొన్నారు. వరద నీటి ప్రవాహంతో 12 రోడ్లు దెబ్బతిన్నాయని, 24 రోడ్లపై వంతెనలు, కల్వర్టులు, రెయిలింగ్ దెబ్బతిన్నాయని, 17 రోడ్లు కోతకు గురయ్యాయని, మూడు రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయని స్పష్టం చేశారు. వీటిని వెంటనే మరమ్మతులు చేపట్టేందుకు రూ.19.48 కోట్లు, శాశ్వత రోడ్డు నిర్మాణానికి రూ.193.47 కోట్లు అవసరమని నివేదికలో పొందుపర్చారు.

ఈ దోపిడీ..!

- 'ఐ లవ్ యూ'తో రూ.11వేలు లాగేసిన నేరగాళ్లు
- కారు చూపించి బంగారం కొట్టేసిన వైనం
- కొత్త ట్రిక్‌లతో సైబర్ మోసాలు

ఆంధ్రజ్యోతి - విజయవాడ: విజయవాడకు చెందిన ఓ అబ్బాయికి ఇన్‌స్టాలో ఓ అమ్మాయి పరిచయమైంది. ఒకరి వీడియోలకు ఒకరు లైక్‌లు కొట్టుకున్నారు. రిప్లైలుగా కన్ను కొట్టే ఎమోజీలు పంపుకున్నారు. కొన్ని రోజుల క్రితం ఇన్‌స్టాలోనే అబ్బాయికి అమ్మాయి ఐ లవ్ యూ అని మెసేజ్ పెట్టింది. దీనికి రిప్లైగా అబ్బాయి ఐ లవ్ యూ టూ అని మెసేజ్ పంపాడు. మర్నాడు ఆ అబ్బాయి ఫోన్ నంబరుకు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. ఇన్‌స్టాలో పరిచయమైన అమ్మాయికి ఐ లవ్ యూ అని చెప్తావా? ఈ విషయం ఆమె భర్తకు తెలిసి ఫోన్ పగలు కొట్టేశాడని చెప్పాడు. తామంతా మైలవరం పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్నామని, అక్కడికి రావాలని బెదిరించాడు. ఈ మాటలకు బెదిరిపోయిన అబ్బాయి ఏం చెప్తే అది చేస్తానని ఏడ్చాశాడు. దీన్ని ఒక అవకాశంగా మార్చుకున్న అవతలి వ్యక్తి ముందుగా రూ.5వేలు ఫోన్ పే చేయించుకున్నాడు. తర్వాత కాసేపటికి మరో రూ.6వేలు జమ చేయించుకున్నాడు. కొద్దిరోజుల క్రితం జరిగిన ఘటన ఇది. ఇన్‌స్టాలో సైబర్ నేరగాళ్లు ఫేక్ ప్రొఫైల్‌తో ఐ లవ్ యూ చెప్పి రూ.11వేలను లాగేశారు. ఒక నేరంపై ప్రజలకు అవగాహన వచ్చిందని తెలిసిన తర్వాత ఈ మోసంలోకి కొత్తరకం ట్రెండ్‌ను దింపుతున్నారు. ఇప్పటి వరకు డిజిటల్ అరెస్టులతో ప్రజలను భయ పెట్టిన ఈ నేరగాళ్లు కొత్త ప్రయోగాలు చేశారు. ఇందులో ఒక ప్రయోగంలో యువకుడు రూ.11వేలను పోగొట్టుకున్నాడు. మరో వ్యాపారి డబ్బులను చెల్లించేసినా వాటిని చెక్కుచెదరకుండా సైబర్ క్రైం పోలీసులు బ్లాక్ చేయించారు. ఈ రెండింటి పైనా పోలీసులు కేసు నమోదు చేశారు.

కారు చూపించి బంగారం కొనేశారు

ఓఎల్ఎక్స్‌లో అమ్మకానికి పెట్టిన కారును చూపించి దాన్ని కొనుగోలు చేయాలనుకున్న వ్యక్తి డబ్బులతో సైబర్ నేరగాళ్లు బంగారం బిస్కట్లు కొనిపించారు. ఈ ఘటనలో బాధితుడు సైబర్ నేరగాళ్లకు పంపిన డబ్బులు మరో ఖాతాలోకి వెళ్లకుండా పోలీసులు 'బ్లాక్' వలయం బిగించారు. గొల్లపూడికి చెందిన అనపర్తి శ్రీకాంత్ కారుల కొనుగోలు, అమ్మకాలు చేస్తుంటాడు. ఏపీ39 క్యూటీ 6856 నంబరు గల ఇన్నోవా క్రిస్టా కారు 30వేల కిలోమీటర్లు తిరిగింది. దీని యజమాని ఓఎల్ఎక్స్‌లో అమ్మకానికి పెట్టారు. దీన్ని గమనించిన సైబర్ నేరగాళ్లు మోసానికి ప్రణాళిక వేశారు. ఓఎల్ఎక్స్‌లో ఉన్న కారు ఫొటోను, దాని కింద ఉన్న ఫోన్ నంబరును సైబర్ నేరగాళ్లు తీసుకున్నారు. ఈ కారు ఫొటోను శ్రీకాంత్ వాట్సాప్‌కు పంపారు. కారును చూసుకోవడానికి వెళ్లాల్సిన ప్రదేశం చెప్పి పంపించారు. కారును చూసుకోవడానికి తాము వస్తున్నామని యజమానితో ఫోన్‌లో మాట్లాడారు. ఆయన తన బావమరిది నంబరు ఇచ్చారు. అదే నంబరు శ్రీకాంత్‌కు ఇచ్చారు. కారు నచ్చడంతో శ్రీకాంత్ కొనుగోలు చేయాలని నిర్ణయించుకున్నాడు. రూ.11లక్షలకు బేరం కుదిరింది. ఆ మొత్తాన్ని పంపించేందుకు నేరగాళ్లు తునిలో ఉన్న ఓ జువెలరీ షాపు బ్యాంక్ ఖాతా నంబరు ఇచ్చారు. శ్రీకాంత్ డబ్బుల ఆర్టీజీఎస్ ద్వారా పంపేడప్పుడు జువెలరీ షాపు పేరు వచ్చింది. దీనితో ఆయన సైబర్ నేరగాళ్లతో మాట్లాడారు. అకౌంట్ పేరు జువెలరీ షాపు పేరు మీద ఉందని అడిగితే దానికే డబ్బులు పంపమని చెప్పారు. ఈ డబ్బులతో సైబర్ నేరగాళ్లు బంగారం బిస్కట్లు కొనుగోలు చేశారు. డబ్బులు పంపిన తర్వాత సందేహం వచ్చి కారును చూపించిన వ్యక్తికి ఫోన్ మొత్తం డబ్బులు పంపానని చెప్పాడు. ఆయన తనకు ఎలాంటి డబ్బులు రాలేదని చెప్పాడు. దీనితో మోసపోయాయని గ్రహించిన శ్రీకాంత్ వెంటనే సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. అదే సమయంలో బ్యాంక్ మేనేజర్‌కు ఫోన్ చేసి తాను పంపిన డబ్బులను బ్లాక్ చేయాలని చెప్పాడు. బ్యాంక్ మేనేజర్ బ్లాక్ చేయకుండా లీన్(ఆ మొత్తాన్ని మాత్రమే బ్లాక్ చేయడం) చేశారు. కేసు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు నోటీసులు ఇవ్వడంతో మొత్తం అకౌంట్‌ను బ్లాక్ చేశారు. ఈ కేసులో ఒక్క రూపాయి ఈ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకట్ట వేశారు.

జారిందా.. ప్రాణాలు గోవిందా!

- టిప్పర్ల నుంచి జారిపడుతున్న డస్టు, కంకర
- పట్టించుకోని పోలీసులు
- మామూళ్ల మత్తులో రవాణా శాఖ అధికారులు
- అడ్డదిడ్డంగా టిప్పర్ల రాక



టిప్పర్లకు పట్టా కట్టినా.. లారీలో నుంచి రోడ్డుపై జారి పడిపోతున్న డస్టు

కంచికచర్ల రూరల్, ఆంధ్రజ్యోతి: అధిక లోడుతో వెళుతున్న టిప్పర్ల నుంచి రహదారిపై జారిపడే డస్టు, కంకర, బూడిద వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో పాటు పలు సందర్భాల్లో ప్రాణాలు కూడా గాలిలో కలసిపోతున్నాయి. జాతీయ రహదారిపై ఈ పరిస్థితి స్పష్టంగా కనిపిస్తుంది. వివరాల్లోకి వెళితే కంచికచర్ల మండల పరిసర ప్రాంతాల్లో ఇసుక క్వారీలతో పాటు గ్రానైట్ క్వారీలు, క్రషర్లు, భారీ సంఖ్యలో నెలకొన్నాయి. వీటి నుంచి రోజూ విజయవాడ, జగ్గయ్యపేట తదితర ప్రాంతాలకు వందలాది టిప్పర్లు, ట్రాక్టర్లు తదితర వాహనాల్లో డస్టు, కంకర, బూడిద ఓవర్ లోడుతో రవాణా అవుతున్నాయి. ఈ వాహనాలు బూడిద, కంకర, ఇసుక రహదారులపై జారిపడకుండా లోడుపై టార్పాలిన్ పట్టాలు కట్టాలి. ఈ పట్టాలు తూతూ మంత్రంగా ఏర్పాటుచేసుకోవడమో, అసలు కట్టకపోవడంతో ఇసుక, కంకర, బూడిద జారి రోడ్డుపై పడుతుండటంలో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అదీగాక టిప్పర్ డ్రైవర్లు అతివేగంగా దూసుకుపోతున్నారు.

పట్టించుకోని రవాణాశాఖ అధికారులు

రవాణా శాఖ అధికారులు కనీసం ఆ వాహనాల వైపు కన్నెత్తి చూడటంలేదు. ప్రమాదాల్లో ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నా... మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కంకర, డస్ట్ రోడ్డు మీద పడినా హైవే అధికారులు కానీ, టోల్‌గేట్ సిబ్బంది కానీ పట్టించుకోవటంలేదనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఇటీవల నందిగామకు చెందిన తల్లీ కూతుళ్లు ద్విచక్ర వాహనంపై ఇబ్రహీంపట్నం నుంచి నందిగామ వైపు వెళుతుండగా లారీలో నుంచి డస్ట్ కళ్లల్లో పడటం, కళ్ళు తుడుచుకునేలోపు వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోవటం క్షణాల్లో జరిగిపోయింది. డ్రైవింగ్ చేస్తున్న కూతురు కాళ్లకు తీవ్ర గాయాలవ్వగా, తల్లికి స్వల్ప గాయాలవటంతో ఊపిరి పీల్చుకున్నారు. అటుగా వెళుతున్న వాహనదారులు స్పందించి రోడ్డుపై పడిపోయిన ఇరువురిని సకాలంలో స్పందించి రక్షించారు. లేకపోతే వెనుక వచ్చే భారీ వాహనాన డ్రైవర్లు గమనించకపోతే ఆ ప్రమాదం ఎంత తీవ్రంగా ఉంటుందో ఊహించలేం.

నిబంధనలు కఠినంగా ఉండాలి

లారీ, టిప్పర్ల డ్రైవర్లు పాటించవలసిన నియమ నిబంధనల పట్ల కఠినంగా వ్యవహరిస్తేనే అమాయకుల ప్రాణాలు గాలిలో కలసిపోకుండా కాపాడిన వారవుతారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అధిక లోడుతో వెళుతున్న వాహనాలపై చర్యలు తీసుకోవడమే కాకుండా, ఇసుక, డస్ట్, బూడిద జారి పడకుండా, వాహనాదారులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని, వాహనదారులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 570

ఘనంగా శ్రీలక్ష్మీగణపతి హోమం

గుడివాడ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : స్థానిక మెయిన్‌రోడ్డులో వేంచేసియున్న విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం 8వ రోజు స్వామి శ్రీలక్ష్మీగణపతి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. 151మంది దంపతుల జంటలు పీటలపై కూర్చుని శ్రీలక్ష్మీగణపతి హోమ పూజలు నిర్వహించారు. ఈ నెల 6వ తేదీన దేవస్థాన ఆవరణలో ఉత్సవ లడ్డూ బహిరంగ వేలంపాట, నిమజ్జన ఊరేగింపు నిర్వహిస్తున్నట్టు దేవస్థాన కార్యనిర్వహణ అధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు(వాసు) తెలిపారు. ధర్మకర్తల కమిటీ చైర్మన్ సాయన రాజేష్, భక్తులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న భక్తులు


ఎలమర్రులో సొసైటీలు తనిఖీ చేసిన తహసీల్దార్ శ్రీను నాయక్

యూరియా కొరతపై ఆందోళన వద్దు

● తహసీల్దార్ శ్రీను నాయక్

పెదపారుపూడి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరత పట్ల రైతులు ఏ మాత్రం అధైర్యపడాల్సిన అవసరం లేదని తహసీల్దార్ శ్రీను నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని పెదపారుపూడి, వెంట్రప్రగడ, వానపాముల, యలమర్రు సొసైటీలను తహసీల్దార్ శ్రీను నాయక్ తనిఖీ చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల అవసరానికి అనుగుణంగా యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆధార్ కార్డు పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్సులు సొసైటీలకు తీసుకురావాలని, రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్‌లో ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వేములపల్లి నరసింహారావు, పాతూరి రమేష్, సొసైటీ కార్యదర్శి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కూటమి ధ్యేయం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే ధ్యేయంగా గుడివాడ నియోజకవర్గంలో యూరియా సమస్య లేకుండా చేసేందుకు కృషి చేస్తున్నామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం రాత్రి సేరీకల్వపూడి పీఏసీఎస్ త్రీమెన్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత త్రీమెన్ కమిటీ చైర్మన్‌గా అట్లూరి శ్రీరామ చంద్రప్రసాద్ , డైరెక్టర్లుగా అనూరాధ, వెంకటేశ్వరరావులచే ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ అధికారులు, పీఏసీఎస్ అధ్యక్షులతో సమీక్షలు నిర్వహించి రైతుల సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సొసైటీ పరిధిలోని గ్రామాల రైతులు,మండల కూటమి నాయకులు శ్రీరామచంద్ర ప్రసాద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరి, రాష్ట్ర గిడంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, జంగం మోహనరావు, పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : విద్యతోనే ఉన్నతి సాధ్యమని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. బుధవారం అంగలూరులోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను సందర్శించారు. ఆయన విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడుతూ వారితో కలసి మధ్యాహ్న భోజనం రుచి చూశారు. చక్కగా చదువుకుని వృద్ధిలోకి రావాలని ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ పాఠశాలకు వచ్చిన అవార్డును ప్రతి ఏటా నిలబెట్టుకోవాలని ఆయన సూచించారు. అనంతరం ఇంటర్మీడియట్ విద్యార్థినులకు నూతన యూనిఫామ్ అందజేశారు. ఇటీవల పాఠశాలలో నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రధానంచేశారు.


శ్రీరామచంద్ర ప్రసాద్, ఎమ్మెల్యేలను గజ మాలతో సత్కరిస్తున్న రావి, కొసరాజు

గుడ్లవల్లేరు : రైతుసేవా కేంద్రాలను ప్రతి రైతూ వినియోగించుకోవాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం అంగలూరు గ్రామంలో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.23.90 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు సేవా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల కోసం అమలు చేసే ప్రతి పథకానికి సంబంధించిన వివరాలను ఈ కేంద్రాల ద్వారా తెలుసుకొని లబ్ధిపొందాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, గుడివాడ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్ పాల్గొన్నారు.

బార్‌ల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

గుడివాడ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన ఎక్సైజ్ బార్ పాలసీలో భాగంగా 2025-28 సంవత్సరాలకు గాను గుడివాడ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గుడివాడ మున్సిపాల్టీ పరిధిలోని మిగిలిన 6బార్‌ల కోసం ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఆఫ్‌లైన్, ఆన్‌లైన్, లేదా హైబ్రిడ్ మోడల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి దరఖాస్తుకు నాన్ రిఫండబుల్ రుసుం కింద రూ.5లక్షలు, దరఖాస్తు ఫీజు రూ.10వేలు చెల్లించాలి. ప్రతి బార్‌కు తప్పనిసరిగా నాలుగు దరఖాస్తులు వస్తేనే డ్రా తీయనున్నారు. 3వతేదీ నుంచి 14వ తేదీ వరకు మాత్రమే దరఖాస్తులను స్వీకరణ జరుగుతుంది. గౌడ కులస్తులకు కేటాయించిన బార్ తాలుకు ఈ నెల 15వతేదీన డ్రా తీసి బార్‌లను కేటాయించనున్నామని సీఐ తెలిపారు.

కురుమద్దాలిలో జాబ్‌మేళా 6న

పామర్రు : నిరుద్యోగ యువతి, యువకులకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఈనెల 6న కురుమద్దాలిలో గల స్కిల్‌డెవలప్‌మెంట్ కేంద్రంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు బుధవారం జిల్లా కలెక్టర్ డీకేబాలాజీ ఓప్రకటనలో తెలిపారు. 10 తరగతి నుంచి డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతి, యువకులకు వివిధ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామన్నారు. ఎంపికైన వారికి రూ.8000నుంచిరూ.20,000 వరకు జీతాలు ఉంటాయని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘ కార్యవర్గం ఏకగ్రీవం

గుడివాడ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నండూరి ఉమాశంకర్, ప్రధాన కార్యదర్శిగా దాసు వెంకట నాగేశ్వరరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం స్థానిక పామర్రు రోడ్డులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సాగిరాజు ఉదయభాస్కరరాజులు కార్యదర్శులుగా పోలా సింహాచలం, గుదే నాగచంద్ర శేఖర్(నాని), సహాయ కార్యదర్శులుగా కంటాల శ్రీనివాసరావు, నండూరి శ్రీనివాస్, సలహా మండలి చైర్మన్‌గా కోలా వెంకటేశ్వరరావు, క్రమశిక్షణ కమిటీ వైస్ చైర్మన్‌గా పూదాంతం మోహన ధన్వంతరి, కార్యవర్గ సభ్యులుగా చీకుర్తి ప్రదీప్‌కుమార్, పోలన అశోక్‌లు ఎన్నికయ్యారు. కృష్ణాజిల్లా కమిటీకి ఎన్నికైన అగ్నిహోత్రం ఫణిగోపాల్, ఘంటా చంటి, చల్లా చంద్రశేఖర్,లాల్ అహ్మద్, బొల్లవరపు రాజు, రమేష్ బాబు ఎంపికయ్యారు. నూతన కమిటీ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు మాట్లాడుతూ సంఘ పరిరక్షణ కోసం, ప్రజలకు ప్రాథమిక వైద్యం అందించే క్రమంలో తప్పులు జరుగకుండా చూసుకుంటామన్నారు. బేసిక్ లైవ్ సపోర్టు ప్రోగ్రాములు, ఫస్ట్ ఎయిడ్ అండ్ హోం నర్సింగ్ శిక్షణను ఆర్ఎంపీలకు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.


నండూరి ఉమాశంకర్


ఉదయ భాస్కరరాజు

ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన తప్పనిసరి

● ఎస్సై రాజేంద్రప్రసాద్

పామర్రు,సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తప్పనిసరిగా చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని పామర్రు ఎస్సై రాజేంద్రప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని నిమ్మకూరు జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు బుధవారం చట్టాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పౌరులు తమ కళ్లెదుట జరిగే అన్యాయాలను, అక్రమాలపై తక్షణమే స్పందించి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పోక్సో చట్టాలను వివరించడంతోపాటు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు. సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. దీంతోపాటుగా ద్విచక్రవాహనలు నడిపే ప్రతి ఒక్కరికీ తప్పని సరిగా లైసెన్స్ కలిగియుండాలన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదన్నారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడవద్దని యువతకు ఉపదేశించారు. ఎవరికైనా ఆపాయం సంభవించినట్లయితే తక్షణమే 100కుడయల్ చేయాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజేంద్రప్రసాద్



నిమ్మకూరుకు నందమూరి బాలకృష్ణ రాక నేడు

పామర్రు సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : హిందూపురం ఎమ్మెల్యే, సినీ హీరో నందమూరి బాలకృష్ణ గురువారం ఉదయం నిమ్మకూరుకు వస్తున్నట్టు మండల టీడీపీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, బొర్రా గాంధీ తెలిపారు. 50 ఏళ్ళ సినీ జీవితం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రపంచంలోనే అరుదైన అవార్డు దక్కించుకున్న బాలకృష్ణ స్వగ్రామమైన నిమ్మకూరు వచ్చి తల్లిదండ్రులైన ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు నివాళులర్పిస్తారని, గ్రామంలో బంధువులతోను, గ్రామాభివృద్ధిపై చర్చలు జరుపుతారని వారు తెలిపారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ

పమిడిముక్కల : చోరగుడిలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి నరిశెట్టి నాగరాజు రూ.16,500 విలువచేసే ప్రింటర్ తన తండ్రి వెంకటేశ్వరరావు ద్వారా హెచ్‌ఎం సంధ్యారాణికి బుధవారం అందజేశారు. వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులకు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామస్థులు ధన్యవాదములు తెలియజేశారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

గుడ్లవల్లేరు : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. విన్నకోట ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాలు, చాక్లెట్లను జనసేన నాయకులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షుడు తోట చిన్నారి, వడ్లమన్నాడు పీఏసీఎస్ చైర్మన్ అడపా బాబి, శేషం కేశవ, సూరిశెట్టి రాజబాబు, సాయికుమార్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు

యోగాతో చదువుపై ఏకాగ్రత పెరుగుతుంది

● ఎంఈవో సీహెచ్ రజని

గుడివాడ రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యోగా వల్ల చదువుపై ఏకగ్రత పెరుగుతుందని గుడివాడ ఎంఈవో సీహెచ్.రజని అన్నారు. బుధవారం చౌటపల్లి ఉన్నత పాఠశాల, రెండు ప్రాథమిక పాఠశాలలను, మల్లాయిపాలెం రెండు ప్రాథమిక పాఠశాలలను ఆమె పరిశీలించారు. ఉపాధ్యాయులు యోగా నేర్పటం చాలా బాగుంద న్నారు. మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలవుతున్నది లేనిది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ప్రాథమిక పాఠశాలలోని రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులకు శిక్షణా తరగతుల్లో అంశాలను ఉపాధ్యాయులు బోధించాలని కోరారు. జరుగుతున్న మార్పులు, చేర్పులకనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్య అందించాలని తెలిపారు. చక్కటి ఉత్తీర్ణత సాధించటానికి మంచి ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు శ్రీలక్ష్మీ, పాల్గొన్నారు.


చౌటపల్లిలో యోగా చేస్తున్న విద్యార్థులు

చెత్త గుట్టల్లో బాల్యం ఛిద్రం

తోట్లవల్లూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రతి బాలుడు, బాలిక తప్పకుండా బడిలో ఉండాలని విద్యాహక్కు చట్టం చెపుతున్నా కడు పేదరికం ఆ పసిబిడ్డలను బడికి వెళ్లనీయటం లేదు. తోట్లవల్లూరు కరకట్ట ఏటి ఒడ్డున గుడిసెలు వేసుకుని చాలా కాలంగా కొందరు జీవిస్తున్నారు. పెద్దలు చేపలు పట్టటం, చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరుకొచ్చి జీవనం సాగిస్తున్నారు. అయితే వీరి పిల్లలను సైతం బడికి పంపకుండా అదే బాటలో నడుపుతున్నారు. తెల్లవారుజామునే ప్లాస్టిక్ బక్కెట్లు పట్టుకుని గ్రామంలో ఇళ్లవెంట తిరిగి చద్దన్నం అడుక్కుని వస్తున్న పిల్లలు ఆ తరువాత చెత్త కాగితాలు ఏరుకుంటున్నారు. పసి పిల్లల భవిత చెత్త గుట్టల్లోనే ఛిద్రమవుతోంది. బుధవారం బడికెళ్లాల్సిన వయస్సున్న బాలుడు, అక్క ఇద్దరు తోట్లవల్లూరు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద చెత్తగుట్టల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరుతూ ఆంధ్రజ్యోతికి కనిపించారు. అధికారులు ఈ పిల్లలను బడికి పంపేందుకు చర్యలు తీసుకోవటం అవసరం.


చెత్త గుట్టలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరుతున్న బాలుడు, అక్క

యూరియా కోసం ఆర్‌ఎస్‌కేల్లో పేర్లు నమోదు

గుడివాడ రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుడివాడ రూరల్ మండలంలో ఆర్‌ఎస్‌కే, పీఏసీఎస్‌ల్లో యూరియా బుధవారం వచ్చింది. యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు ఆర్‌ఎస్‌కే, సహకార సంఘాల వద్ద రైతులు తమ వివరాలు నమోదు చేసుకున్నారు. వలివర్తిపాడు, సెరిదింటకుర్రు, బొమ్ములూరు, బిళ్లపాడు పీఏసీఎస్‌ఎల వద్ద యూరియా తీసుకున్నారు.

పమిడిముక్కల : పమిడిముక్కల మండల పరిధిలో రైతులకు మనగ్రోమోర్ సంస్థ ద్వారా బుధవారం యూరియా పంపిణీచేశారు. మన గ్రోమోర్‌కు యూరియా వచ్చినట్టు తెలుసుకున్న రైతులు ఉదయం అక్కడకు చేరుకుని క్యూలో నిల్చొని టోకెన్లు తీసుకున్నారు. సంస్థకు 19.80 టన్నులు యూరియా రాగా పొలం విస్తీర్ణం బట్టి ఆధార్, పట్టాదారు పాసుపుస్తకాలు చూసి ఎకరాకు అర కట్ట చొప్పున సాగుచేసిన పొలాన్ని బట్టీ 2కట్టల వరకు రైతులకు పంపిణీ చేశామని మండల వ్యవసాయ అధికారి గణేశ్ రెడ్డి తెలిపారు.


ఎరువుల కోసం పేర్లు నమోదు చేసుకుంటున్న రైతులు

స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టరుగా లింగమనేని

కూచిపూడి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టరుగా పామర్రు నియోజకవర్గ పరిధిలోని మొవ్వ మండలం పెదముత్తేవి గ్రామానికి చెందిన టీడీపీ మొవ్వ మండల అధ్యక్షులు లింగమనేని రామలింగేశ్వరరావును ప్రభుత్వం నియమించింది. పార్టీ ఆవిర్భావం నుంచీ క్రియాశీలకంగా వ్యవహరిస్తూ పార్టీ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లటంలో రామలింగేశ్వరరావు ఎంతగానో కృషిచేశారు. ఈయన నియామకం పట్ల పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాతోపాటు కొసరాజు ప్రకాష్ మాధుర్, వీరంకి తులసీదాస్, తాతినేని పూర్ణచంద్రరావు, ఈడే నాగేశ్వరరావు, మండవ కోటేశ్వరరావు తదితరులు అభినందనలు తెలిపారు.


బాధితుడికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

లబ్ధిదారుడికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

పామర్రు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పామర్రుకు చెందిన భోగిన శ్రీనుఅనే అనారోగ్యబాధితుడికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.72,820 నగదు చెక్కును మంగళవారం రాత్రి ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

నా క్లయింటు కృష్ణాజిల్లా, పమిడిముక్కల మండలం మంటాడ గ్రామ కాపురస్తులు మేరుగ సుబ్బారావు గారి భార్య మేరుగ లక్ష్మీ గారి సంజాయిషీతో యావన్మందికి తెలియజేయునది ఏమనగా....

ది. 25-4-2025న నా క్లయింటు ,కెనరా బ్యాంకు మంటాడ బ్రాంచి లోని ఒరిజినల్ డాక్యుమెంట్స్ జిరాక్సు అవసర నిమిత్తం బ్యాంకు వారిని అడిగి తాకట్టుపెట్టిన ఒరిజినల్ దస్తావేజులు తిరిగి ఇచ్చే పూచీకత్తుతో డాక్యుమెంటును తీసుకొని మంటాడలోని మెయిన్ రోడ్డు నందు గల జిరాక్సు షాపుకు వెళ్ళవచ్చు క్రమములో టూవీలర్ కు తగిలించిన దస్తావేజులు గల సంచి పడిపోయినది. ఎంత వెదికినను దొరకలేదు .దానిలో నా క్లయింటుకు సంబంధించి పమిడిముక్కల మండలం, గురజాడ గ్రామం లోని పాత సర్వే నెం:214/2, మరియు క్రొత్త సర్వే నెంబరు 214/2బి ఖాళీ నివేశన స్థలం 395చ.గలు మరియు రీసర్వే నెం: 212/3సి య.0-12సెంట్లు సంబంధించి ఉయ్యూరు సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసునందు రిజిష్టరు కాబడిన దస్తావేజు ది. 03 -10-2003న నెం:3042/2003, మరియుది.10-07-2003న రిజిష్టరు కాబడిన దస్తావేజు 1493/2003లు పోయినవి, ఇవి ఎవరికైన దొరికినయెడలపైన గలనాక్లయింటు అడ్రసుకు గాని ఈదిగువ గల నా అడ్రసుగాని ఇవ్వవలసినదిగా మనవి

ఇట్లు-
K.Bulliswamy, Advocate, G.F.103
Sriprahasa Towers, Sri Ramachandra nagar. Vijayawada -520008
Ph: 94400 97766

800 మందికి అన్నదానం


నందివాడ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నవరాత్రుల్లో భాగంగా పోలుకొండ శివారు నాగభూషణపురంలో బుధవారం వినాయకుడి కమిటీ సభ్యులు బొర్రా సత్యనారాయణ, ఉప్పల వెంకటేశ్వరరావు, గుత్తికొండ నరసింహారావు, కొల్లి రవి, కోనేరు వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యేశ్వరరావు, కనుమూరు శ్రీనివాస్, కాకరాల బుధవారం సుమారు 800 మందికి సత్యనారాయణ కనుమూరి రమణ ఆధ్వర్యంలో సుమారు 800 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా గుడివాడ అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య, ధర్మపాలు దేవాలయ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల బోసరాజు, గ్రామస్థులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

● కలెక్టర్ డీకే బాలాజీ

కంకిపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్వామిత్వ సర్వే కార్యక్రమాన్ని ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. గుడివాడ, ఉయ్యూరు డివిజన్ల పరిధిలోని అధికారులు, సిబ్బందికి స్థానిక శ్రీకృష్ణ కల్యాణమండపంలో బుధవారం స్వామిత్వ సర్వేపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో భూ తగాదాలను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్వామిత్వ సర్వే కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు రాకుండా ఆర్.ఎస్.డి.టిల స్పీకింగ్ ఆర్డర్లను నమోదు చేయాలన్నారు. సర్వే చేసిన రోజునే వెక్టరైజేషన్ పూర్తి చేస్తే రికార్డుల స్పష్టంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీపీవో జె. అరుణ, ఏడీ జోషిలా, డీఎల్‌పీవో సంపత్ కుమార్,డీఎల్‌డీవో రాజేష్, ఎంపీడీవో అనూష, పాల్గొన్నారు.

పమిడిముక్కల :మర్రివాడలో భూమి రీసర్వే రికార్డులను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ బుధవారం పరిశీలించారు. గ్రామంలో ఇటీవల భూమి రీసర్వే పూర్తికాగా దీనికి సంబంధించిన రికార్డుల ను పరిశీలించి రైతులతో మాట్లాడి అభ్యంతరాలు ఏమైనా ఉన్నాయా అని ఆరాతీశారు. ఈ సందర్భంగా యూరియా కొరత గురించి రైతులు రాజేంద్రప్రసాద్ తదితరులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సంబంధిత డిపార్ట్‌మెంట్ అధికారులతో మాట్లాడి త్వరలో సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలీ శర్మ, ఆర్డీవో హేలాషారోన్, తహసీల్దార్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలా జీ



బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 570

నిత్యాన్నదాన పథకానికి రూ.50 వేలు విరాళం

మోపిదేవి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి తెనాలికి చెందిన గాజుల పార్థసారథి-షణ్ముఖప్రియ దంపతులు రూ.50,011 విరాళమిచ్చారు. బుధవారం వారు ఆలయానికి విచ్చేసి స్వామిని దర్శించుకుని, నగదును ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావుకు అందించారు.



దాతలకు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి చిత్రపటం, ప్రసాదాలు అందిస్తున్న ఆలయ ఈవో శ్రీరామవరప్రసాదరావు

ప్రశాంత వాతావరణంలో మిలాద్ ఉన్ నబీ జరుపుకోండి

● ముస్లిం పెద్దలకు సీఐ నాగేంద్రప్రసాద్ సూచన

పెడన, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇతర మతాల వారి మనోభావాలు దెబ్బతినకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో మిలాద్ ఉన్ నబీ పండుగను జరుపుకోవాలని ముస్లిం పెద్దలకు సీఐ కె.నాగేంద్రప్రసాద్ సూచించారు. గత ఏడాది మిలాద్ ఉన్ నబీ సందర్భంగా పట్టణంలో ఘర్షణలు జరిగిన కారణంగా బుధవారం పెడన పోలీసు స్టేషన్‌లో ముస్లిం పెద్దలతో సీఐ సమావేశం నిర్వహించారు. శుక్రవారం పండుగ సందర్భంగా నిర్వహించే ఊరేగింపు రూట్ మ్యాప్ ప్రకారమే జరుపుకోవాలని సూచించారు. అబ్దుల్ ఖదీర్, నూరుల్లా, ఖదీర్, గఫార్ పాల్గొన్నారు.

వినాయకుడి లడ్డూ రూ.57 వేలు

మచిలీపట్నం టౌన్: చిట్టిపాలెం గ్రామంలో వినాయక నవరాత్రులు సందర్భంగా చవితి పందిరిలో గణనాథుడి వద్ద ఉంచిన 10 కేజీల మహా లడ్డూకు వేలం నిర్వహించారు. గ్రామస్తుడు అంబటి తాతయ్య కుమారుడు శివకోటినాగరాజు రూ.57 వేలకు దక్కించుకున్నారు. నాగరాజును గ్రామస్థులు అభినందించారు.

వైభవంగా నిమజ్జనాలు



గూడూరు/మోపిదేవి/మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాల నిమజ్జనాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. గూడూరులోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి మేళతాళాలతో గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం రామరాజుపాలెం కాలువలో నిమజ్జనం జరిపారు. మోపిదేవి మండలం మోపిదేవిలంకలో విశేష పూజలు అందుకున్న గణాధుని నిమజ్జనోత్సవం వైభవంగా జరిగింది. విగ్రహాన్ని తీసుకెళుతున్న వాహనంపై గ్రామానికి చెందిన యువకులు టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఫొటోలను వాహనంపై ఉంచి, పురవీధుల్లో ఊరేగించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. మచిలీపట్నంలోని పలు ప్రాంతాల్లోని వినాయక విగ్రహాలను మంగినపూడి బీచ్‌లోని సముద్రంలో నిమజ్జనం చేసేందుకు ట్రాక్టర్లపై ఊరేగింపుగా తీసుకుని వెళ్లారు. ఊరేగింపు ముందు యువత డీజేల పాటలకు అనుగుణంగా నృత్యాలు చేశారు.



మోపిదేవి, గూడూరులో నిమజ్జనానికి తరలివెళుతున్న గణనాథులు

భక్తిశ్రద్ధలతో భగవద్గీత పారాయణ

నాగాయలంక: ప్రసన్న గణపతి స్వామి ఆలయంలో 68వ వార్షిక వినాయక నవరాత్రి మహోత్సవాల సందర్భంగా బుధవారం సామూహిక సంపూర్ణ భగవద్గీత పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిట్టా వాణి ఆధ్వర్యంలో నాగాయలంక భగవద్గీత బృంద సభ్యులు పారాయణం చేశారు. అనంతరం గుంటూరుకు చెందిన భాగవతారిణి తిరువళ్లూరి దివ్య సాయి చెప్పిన శివలీలలు హరికథ భక్తులను అలరించింది.



భగవద్గీత పారాయణ చేస్తున్న మహిళలు

భారీ అన్నదానం

భావదేవరపల్లిలో ఆవుల, ముమ్మారెడ్డి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి మహోత్సవాల్లో 8వ రోజు బుధవారం వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. 2 వేల మందికి అన్నదానం చేశారు. సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, ఎస్సై కె.రాజేష్, ముమ్మారెడ్డి శ్రీనివాసరావు, పూషడపు నిరంజనరావు పాల్గొన్నారు.

కులమతాలకతీతంగా వేడుకల నిర్వహణ అభినందనీయం

● కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

ఘంటసాల: కులమతాలకతీతంగా ఘంటసాల గ్రామంలో వినాయక చవితి వేడుకలు నిర్వహించడం అభినందనీయమని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. బుధవారం ఘంటసాల విచ్చేసిన ఆయన మీడియాతో మాట్లాడారు. ఘంటసాల గ్రామంలో షేక్ అక్బర్ బాషా అనే ముస్లిం వినాయక ఉత్సవాలు నిర్వహించ డం మంచి పరిణామమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గణేశ్ ఉత్సవాల పర్మిషన్ కోసం సింగిల్ విండో విధానం అమలు చేశారని, ఉత్సవ కమిటీలపై భారం పడకుండా విద్యుత్ ఉచితంగా ఇచ్చారని తెలిపారు. అనంతరం శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భాను ప్రకాష్, షేక్ అక్బర్ బాషాను ఆయన సత్కరించారు. దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ఆయన ప్రారంభించారు. టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, టీడీపీ నాయకులు పరుచూరి సుభాష్ చంద్రబోస్, కృష్ణా మిల్క్ యూనియన్ కార్యవర్గ సభ్యుడు వేమూరి సాయి వెంకటరమణ, ఘంటసాల పీఏసీఎస్ అధ్యక్షుడు బండి పరాత్పరరావు, వేమూరి రత్నగిరిరావు పాల్గొన్నారు.



ఘంటసాలలో గణనాథుడికి పూజలు చేస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, టీడీపీ నేతలు

వేకనూరు ఎస్టీ కాలనీలో నిలిచిన నీరు

● అవస్థలు పడుతున్న స్థానికులు

(ఆంధ్రజ్యోతి-అవనిగడ్డ రూరల్): ఇటీవల కురిసిన వర్షాలకు వేకనూరు ఎస్టీ కాలనీలో నీరు నిలిచిపోయింది. దీంతో ఈ ప్రాంతవాసులు ఇబ్బంది పడుతున్నారు. మురుగు బయటకు పోకపోవడంతో నీళ్లలోనే నడుస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



కాలనీ దుస్థితిని తెలియజేస్తున్న స్థానికులు

తాకట్టు పెట్టిన నగలను రుణం కింద మినహాయించుకునే హక్కు బ్యాంకుకు లేదు

● జిల్లా పర్మినెంట్ లోక్ అదాలత్ తీర్పు

మచిలీపట్నం క్రైమ్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాపు కార్పొరేషన్ కింద తీసుకున్న లోన్ చెల్లించలేదని తాకట్టు పెట్టిన నగలను మినహాయించుకునే హక్కు బ్యాంకుకు లేదని జిల్లా పర్మినెంట్ లోక్ అదాలత్ స్పష్టం చేసింది. కాపు కార్పొరేషన్ రుణానికి, గోల్డ్ లోన్ రుణానికి సంబంధం లేదని, ఏ రుణం తీసుకుంటే దాని కింద చేసే చెల్లింపులే వర్తిస్తాయని పేర్కొంది. తాకట్టు పెట్టిన నగలతో పాటు రూ.10,000ను ఖాతాదారుడికి 15 రోజులలోపు చెల్లించాలని ఇండియన్ బ్యాంకు అధికారులను ఆదేశిస్తూ తీర్పు చెప్పింది. కేసు వివరాల ప్రకారం.. మచిలీపట్నానికి చెందిన ఇల్లూరి వెంకట నరసయ్య తన అవసరాల నిమిత్తం 2018 నవంబరు 3న 45 గ్రాముల బంగారాన్ని రూ.64,000కు గోల్డ్‌లోన్ నిమిత్తం భీమవరం ఇండియన్ బ్యాంక్‌లో తాకట్టు పెట్టాడు. బ్యాంకు వారు వెంకట నరసయ్యకు డబ్బులు చెల్లించలేదు. గతంలో కాపు కార్పొరేషన్ లోన్ పెండింగ్‌లో ఉందని, గోల్డ్‌లోన్ డబ్బులు కాపు కార్పొరేషన్ లోన్ నిమిత్తం జమ చేసుకున్నామని సమాధానమిచ్చారు. దీంతో వెంకట నరసయ్య బ్యాంకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా స్పందన లేకపోవడంతో 2019లో మచిలీపట్నంలోని పర్మినెంట్ లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి 22 డాక్యుమెంట్లను పరిశీలించిన లోక్ అదాలత్ బుధవారం వెంకట నరసయ్యకు అనుకూలంగా తీర్పు చెప్పింది. 15 రోజులలోపు నగలు అందజేయాలని, బ్యాంకు సేవా లోపం కింద రూ.3000, ఖాతాదారుడిని మానసిక వ్యథకు గురి చేసినందుకు రూ.5000, కోర్టు ఖర్చుల కింద మరో రూ.2000ను నెల రోజులలోపు చెల్లించాలని తీర్పు చెప్పింది.

మోదుమూడిలో 20 టన్నుల యూరియా సరఫరా

అవనిగడ్డ రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మోదుమూడిలో రైతులకు బుధవారం 20 టన్నుల యూరియాను సరఫరా చేశారు. రైతు సేవా కేంద్రం వద్ద క్రమ పద్ధతిలో విక్రయించారు. అవనిగడ్డ పీఏసీఎస్ చైర్మన్ మాదివాడ రత్నారావు, జనసేన పార్టీ సీనియర్ నాయకుడు బచ్చు వెంకటనాథ్‌ప్రసాద్, కోడూరు డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథప్రసాద్, జనసేన మం డల నాయకుడు బచ్చు శ్రీహరి, పార్టీ గ్రామ అధ్యక్షుడు బచ్చు వెంకటనారాయణ, అగ్రికల్చర్ అసిస్టెంట్ నాగబాబు పాల్గొన్నారు.



యూరియా పంపిణీ చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ మాదివాడ రత్నారావు

రైతుకు కట్ట చొప్పున పంపిణీ

ఘంటసాల: ఘంటసాల, లంకపల్లి గ్రామాల్లో బుధవారం యూరియా పంపిణీ చేసినట్లు తహసీల్దార్ బి.విజయప్రసాద్ తెలిపారు. లంకపల్లి సొసైటీకి 425 కట్టలు, ఘంటసాల సొసైటీకి 555 కట్టలు వచ్చాయని తెలిపారు. రైతుకు కట్ట చొప్పున పంపిణీ చేశామని ఆయన పేర్కొన్నారు.

రైతుల అవసరాలకు సరిపడా యూరియా సరఫరా చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు డిమాండ్

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతుల అవసరాలకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు డిమాండ్ చేశారు. సీపీఎం కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వరి పంటకు ప్రస్తుతం యూరియా అవసరమని, వందలాది మంది రైతులు యూరియా కోసం గంటల తరబడి సహకార సంఘాల వద్ద క్యూలో నిలబడుతున్నారని, అయినప్పటికీ అందరికీ దొరకడం లేదని ఆయన అన్నారు. జిల్లా అధికారులు జోక్యం చేసుకుని రైతుల అవసరాలకు సరిపడా యూరియాను వెంటనే సరఫరా చేయాలని కోరారు.

టీడీపీ సీనియర్ నేత మండవ సుధాకరరావు కన్నుమూత

మోపిదేవి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెదప్రోలు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మండవ సుధాకరరావు(72) బుధవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడిగా ఐదేళ్లపాటు బాధ్యతలు నిర్వహించి పార్టీ బలోపేతానికి ఆయన విశేష కృషి చేశారని పార్టీ శ్రేణులు కొనియాడారు. ఆయన మృతికి గ్రామ, మండల నాయకులు సంతాపం తెలిపారు.



హస్తకళలు దేశ సంస్కృతికి ప్రతీక

పెడన, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): దేశ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలైన హస్తకళలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని హ్యాండీక్రాఫ్ట్ సర్వీస్ సెంటర్ ప్రమోటింగ్ అధికారి ఎస్‌హెచ్‌వీవో రవీంద్ర గౌతమ్ అన్నారు. హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కళాంజలి హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులకు హస్తకళలపై అవగాహన సదస్సు, ప్రదర్శన నిర్వహించారు. కలంకారీ బ్లాకులు, రోల్డుగోల్డు నగలు, గుర్రపుడెక్కలతో తయారు చేసిన బుట్టలు ప్రదర్శించారు. ఎంఈవో ఎం.సలోమి, ఎంఈవో-2 వై.వి.హరనాథ్, కలంకారీ క్లస్టర్ కార్యదర్శి జంపాన శ్రీనివాస్, కరస్పాండెంట్ ప్రసన్నలక్ష్మి, ప్రిన్సిపాల్ కె.దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.



హస్తకళల ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఈవో సలోమి

వేంకటేశ్వరస్వామి దేవాలయ పాలకవర్గ ప్రమాణస్వీకారం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గొడుగుపేట వేంకటేశ్వరస్వామి దేవాలయంలో నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం బుధవారం వైభవంగా జరిగింది. చైర్మన్‌గా వడ్లమూడి లక్ష్మీనరసింహారావు, సభ్యులుగా నూతి మణి, తోట శైలజ, తమ్మన రవీంద్రనాథ్, జొన్నలగడ్డ మాధవి, బొమ్మిడి నాగలక్ష్మి, వీరంకి రాజేష్, ముత్యాల లీలాపతి ఆచార్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ఈవో ఏవీ గోపాలరావు, ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. గొర్రెపాటి గోపీచంద్, పల్లపాటి సుబ్రహ్మణ్యం, అన్నం ఆనంద్, లోగిశెట్టి స్వామి, పీవీ ఫణికుమార్, కట్టా అంజిబాబు, అక్కుమహంతి రాజా, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, విష్ణుబొట్ల సూర్యనారాయణశర్మ, నూకలప్రసాద్ పాల్గొన్నారు.



గొడుగుపేటలో ప్రమాణస్వీకారం చేస్తున్న పాలకమండలి సభ్యులు

పంచాయతీలకు నిధులు ఇచ్చినందుకు కృతజ్ఞతలు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేసినందుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు బందరు మండలం పెదయాదర సర్పంచ్ గళ్లా తిమోతి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం డిప్యూటీ సీఎంను మంగళగిరిలో ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వమొచ్చాక తారురోడ్ల నిర్మాణాలు జరిగాయన్నారు.



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలిసిన పెదయాదర సర్పంచ్ గళ్లా తిమోతి

సెప్టిక్ ట్యాంకులో పడి వలస కార్మికుడి దుర్మరణం

బంటుమిల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పొట్టకూటికోసం జార్ఖండ్ నుంచి స్థానికంగా పనులు చేయడానికి వచ్చిన కార్మికుడు ప్రమదవశాత్తు సెప్టిక్ ట్యాంకులో పడి మృతి చెందిన ఘటన పెదతుమ్మిడి గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన నేతల రత్నరాజు గృహనిర్మాణ పనులు చేపట్టారు. కార్పెంటర్ పనుల నిమిత్తం విజయవాడకు చెందిన కాంట్రాక్టర్‌ను సంప్రదించారు. ఆయన జార్ఖండ్‌కు చెందిన నలుగురిని పెదతుమ్మిడి గ్రామానికి పంపారు. కార్మికులు రత్నరాజు ఇంట్లో కార్పెంటర్ పనులు చేస్తున్నారు. మధ్యాహ్నం భోజనం తరువాత వారిలో వికాస్‌కుమార్ శర్మ(43) అనే కార్మికుడు బాత్రూమ్‌కు వెళుతున్నాని బయటకి వచ్చాడు. అక్కడ ఉన్న మూత లేని సెప్టిక్ ట్యాంకులో తలకిందులుగా పడిపోయాడు. శబ్దాన్ని గమనించిన తోటి కార్పెంటర్లు పరుగున వచ్చి సెప్టిక్ ట్యాంకులో రెండు అడుగుల లోతు నీటిలో తలకిందులుగా పడి ఉన్న వికాస్‌కుమార్ శర్మను వెంటనే బయటికి తీసి చినపాండ్రాక పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. అనంతరం మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇంటి పనులు పర్యవేక్షించే సూపర్‌వైజర్ పాలడుగు చిరంజీవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై గణేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మండవ శేషగిరి సహకారం అభినందనీయం

చల్లపల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పేదవిద్యార్థుల విద్యాభివృద్ధికి చల్లపల్లి రాజా కళాశాల పూర్వవిద్యార్థి, ఎన్నారై మండవ శేషగిరి అందిస్తున్న సహకారం అభినందనీయమని జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ అన్నారు. కళాశాలలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థిని గంజాల అశ్విని, 9వ తరగతి విద్యార్థి పోతర్లంక ధనుష్‌కు సగం ధరకే బుధవారం శేషగిరి ల్యాప్‌టాప్‌లు అందజేశారు. చల్లపల్లి రాజా కళాశాల, మోపిదేవి, మొవ్వ, భట్లపెనుమర్రు, తాళ్లపాలెం, తవిసిపూడి జడ్పీ హైస్కూళ్లలో స్టెమ్ టెక్నాలజీ ఎడ్యుకేషన్‌కు సహకారం అందిస్తున్నానని, ఈ పాఠశాలల్లో విద్యార్థులు సగం ఖర్చు భరిస్తే మిగతా సగం ఖర్చు తాను భరించి ల్యాప్‌టాప్‌లు అందిస్తానని శేషగిరి తెలిపారు. హెచ్‌ఎం ఎస్.సుదర్శనప్రసాద్, టీఎస్వీ శాస్త్రి, టి.రేణుప్రసాద్ పాల్గొన్నారు.



చల్లపల్లి రాజా కళాశాల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందిస్తున్న ఎన్నారై మండవ శేషగిరి

పేపర్ నాయుడుకు సత్కారం

ఘంటసాల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కొడాలి, వేములపల్లి, ఘంటసాలపాలెం, దేవరకోట, కొత్తపల్లి గ్రామాల్లో 42 ఏళ్లుగా పాఠకులకు సకాలంలో పేపర్ అందిస్తూ పేపర్ నాయుడుగా పేరొందిన వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయమని టీడీపీ సీనియర్ నాయకుడు పరుచూరి సుభాష్ చంద్రబోస్ అన్నారు. బుధవారం తాడేపల్లిలోని సుభాష్ చంద్రబోస్ ఇంటి వద్ద పేపర్ నాయుడును టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యార్లగడ్డ వీరభద్రరావు, సూరపనేని శివరామప్రసాద్, మొవ్వ శ్రీరామ్మూర్తి, కొడాలి లక్ష్మణ్, అరవపల్లి శేషబాప య్య, సూరపనేని వెంకట్రావు, దోనేపూడి కోటేశ్వరరావు, సూరపనేని హనుమంతరావు పాల్గొన్నారు.



పేపర్ నాయుడును సత్కరిస్తున్న టీడీపీ సీనియర్ నేత పరుచూరి సుభాష్ చంద్రబోస్ తదితరులు

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కాలెపు సూరిబాబు

పెడన, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పట్టణానికి చెందిన చేనేత ప్రముఖుడు కాలెపు సూరిబాబు నియమితులయ్యారు. సంఘ జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నుంచి సూరిబాబు నియామక పత్రాన్ని అందుకున్నారు. తనకు సంఘ రాష్ట్ర కార్యదర్శి పదవి రావడానికి సహకరించిన ఆర్. కృష్ణయ్య, సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేంద్రరావు, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు నూకాలమ్మకు సూరిబాబు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా వ్రతాలు

అవనిగడ్డ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): లక్ష్మీనారాయణస్వామి ఆలయంలోని ఆస్థాన మండపంలో బుధవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు వైభవంగా నిర్వహించారు. 20 మంది భక్తులు వ్రతాల్లో పాల్గొన్నారు. భక్తులకు ధర్మకర్త పోతరాజు భాస్కరరావు దంపతులు ఉచితంగా పూజా సామగ్రిని అందించారు. ఆలయ ఈవో వై.వాసు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శతాధిక వృద్ధురాలి కన్నుమూత

గూడూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మల్లవోలు ముదిరాజ్‌పాలేనికి చెందిన శతాధిక వృద్ధురాలు పిట్టల భాగ్యం(108) బుధవారం మృతిచెందారు. ఆమె మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.



పిట్టల భాగ్యం (ఫైల్)

మత్తు పదార్థాల వినియోగంతో అనర్థాలు

మచిలీపట్నం క్రైమ్ సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల వినియోగంతో అనేక అనర్థాలు కలుగుతాయని విద్యార్థులకు శక్తి టీం సభ్యులు వివరించారు. ఆపరేషన్ గరుడ సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమంలో భాగంగా గ్రేస్ నర్సింగ్ కళాశాలలో డ్రగ్స్ వద్దు మన భవిష్యత్ మన చేతిలో అనే కార్యక్రమాన్ని ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శక్తి టీం విమెన్ సబ్ ఇన్‌స్పెక్టర్ మాణిక్యం, బందరు తాలూకా పోలీస్ స్టేషన్ పీఎస్సై మల్లికాసులు, కాలేజీ కరస్పాండెంట్ సరస్వతి, ఈగల్ టీం, శక్తి టీం సభ్యులు పాల్గొన్నారు.